



అవ్వాతాతలను ఏడిపించెన్

పింఛన్ కోసం మండుటెండలో బ్యాంకుల వద్ద పడిగాపులు

కొందరి ఖాతాలు మనుగడలో లేకపోవడం, ఈకేవైసీ సమస్యల వల్ల జరగని చెల్లింపులు

- ముందుగా ఖాతాను యాక్టివ్ చేసుకుని మర్నాడు రావాలని బ్యాంకు సిబ్బంది సూచన
- నిరాశతో వెనుదిరిగిన లబ్ధిదారులు
- కావాలనే ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందని, గత నెల మాదిరిగా సచివాలయాల వద్ద ఇచ్చినా బాగుండేదని పలువురి ఆవేదన

అనకాపల్లి/నర్సీపట్నం/మాడుగుల రూరల్/దేవరాపల్లి/పాయకరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి):

సామాజిక పింఛన్ల పంపిణీపై వైసీపీ ప్రభుత్వం పన్నిన కుట్రకు జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు గురువారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండుటెండలో బ్యాంకుల వద్దకు చేరుకుని గంటల తరబడి పడిగాపులు కాశారు. కొంత మంది ఆధార్ కార్డు మాత్రమే వెంట తెచ్చుకొని, బ్యాంకు ఖాతా పుస్తకాలు తీసుకు రాకపోవడంతో వెనుతిరగాల్సి వచ్చింది. ఈకేవైసీ సమస్య కారణంగా డబ్బులు డ్రా చేయలేని పరిస్థితి నెలకొంది. కొందరి బ్యాంకు ఖాతాలు మనుగడలో లేకపోవడంతో రూ.100 చెల్లించి యాక్టివ్ చేసుకోవాలని, మర్నాడు డబ్బులు డ్రా చేసుకోవాలని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో వృద్ధులు ఉసూరుమన్నారు.

జిల్లాలో 2,65,210 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 1,97,790 మందికి డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతిలో బ్యాంకుల్లో జమ చేయాల్సి ఉండగా గురువారం నాటికి 1,89,723 మందికి (95.92 శాతం) బ్యాంకుల్లో జమ అయినట్టు అధికారులు చెబుతున్నారు. బ్యాంకు ఖాతాల్లేని లబ్ధిదారులు 67,420 మంది ఉండగా, గురువారం సాయంత్రానికి 60,530(89.78 శాతం) మందికి నేరుగా ఇళ్లకు వెళ్లి నగదు అందించారు.

బ్యాంకుల వద్ద పడిగాపులు

ఈ నెల ఒకటో తేదీన మేడే సందర్భంగా బ్యాంకులకు సెలవు దినం కావడం, 2వ తేదీన కొన్నిచోట్ల బ్యాంకుల సర్వర్లు డౌన్ కావడం, ఇతర సాంకేతిక కారణాలతో పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. కె.కోటపాడు మండలం ఎ.కోడూరుకు చెందిన వన్నం అచ్చెయ్యమ్మ స్థానిక బ్యాంకు ఏటీఎంలో పింఛన్ పడిందా? లేదా? అని చూసుకోగా నగదు జమ కాలేదు. కె.కోటపాడు ఎస్‌బీఐ బ్రాంచికి వెళ్లి వాకబు చేయగా ఆమె ఖాతాలో నగదు జమ కాలేదని చెప్పారు. దీంతో ఆమె నిరాశతో ఇంటికి వెనుదిరిగింది. మాడుగులలో ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఏపీజీవీబీ బ్యాంకులు పింఛన్‌దారులతో కిటకిటలాడాయి. కొందరికి కేవైసీ కాకపోవడం, వేలిముద్రలు పడకపోవడంతో పింఛన్ అందుకోలేకపోయారు. దేవరాపల్లిలో బ్యాంకుల వద్ద పింఛన్‌దారులు బారులుతీరారు. చాలా మంది ఖాతాలు మనుగడలో లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఖాతాతో ఆధార్ అనుసంధానం కాలేదని కొందరికి నగదు చెల్లించలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు నిరాశతో ... మిగతా 8వ పేజీలో



నర్సీపట్నంలోని బ్యాంకులో బారులుతీరిన పింఛన్ లబ్ధిదారులు



పింఛన్‌దారులతో రద్దీగా ఉన్న మాడుగుల ఇండియన్ బ్యాంక్ బ్రాంచి

బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తోంది



మండుటెండలో స్థానిక స్టేట్ బ్యాంకు శాఖకు వచ్చాను. ఇక్కడకు వస్తే బ్యాంక్ కస్టమర్(బీసీ) పాయింట్‌కు వెళ్లి పింఛన్ డబ్బులు తీసుకోమని చెబుతున్నారు. కనీసం సచివాలయం వద్ద పింఛన్ ఇచ్చినా బాగుండేది. బ్యాంకుల గురించి తెలియని మేము, వాటి చుట్టూ తిరగాల్సి వస్తోంది. పింఛన్ అందుకునేలోగా ప్రాణం పోయేలాగా ఉంది. - వారాది మహలక్ష్మి, దేవరాపల్లి



మత్స్యకారుడు ఇచ్చిన టోపీ, చేపతో పవన్ కల్యాణ్

వైసీపీని బంగాళాఖాతంలో కలపాలి

మార్పు కోసం ముందుకురావాలి

- ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపు
- వైసీపీ నేతల భూ కబ్జాలపై ప్రత్యేక కమిషన్‌తో విచారణ
- విశాఖ ప్రజల గుండెల్లో ధైర్యం నింపడానికి వచ్చా..

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ప్రజలను అనేక విధాలుగా మోసం చేసి, భూములు లాక్కున్న వైసీపీని బంగాళాఖాతంలో కలిపేయాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి ఆయన విశాఖలోని పూర్ణామార్కెట్ ప్రాంతంలో గల దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. విశాఖలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి వాటాలు వేసుకొని మరీ భూములు ఆక్రమించారని, ఇప్పుడు కొత్తగా తెచ్చిన ల్యాండ్ టైటిల్ చట్టంతో వారు మరింత పెట్రేగిపోతారన్నారు. విశాఖలో సొంత ఎంపీ ఎంవీవీ కుటుంబానికే వైసీపీ ప్రభుత్వం భద్రత కల్పించలేకపోయిందని, ఇక ప్రజలకు ఎలా రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు.

విశాఖలో కాలుష్యం అధికంగా ఉందని, అటు సముద్ర కాలుష్యం, ఇటు పరిశ్రమల కాలుష్యం ఎక్కువైందని, వాటిపై నియంత్రణ మండలి, కలెక్టర్ చర్యలు తీసుకోవడం లేదని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. జీతాలు తీసుకొని పని చేయని అధికారులను చొక్కా పట్టుకొని ప్రశ్నించాలని సూచించారు. తాను విశాఖలోనే నటనలో ఓనమాలు దిద్దుకున్నానని, ఈ ప్రాంతం అంటే అభిమానమని చెప్పారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు కాలిపోయినప్పుడు ఒక్కొక్కరికి రూ.50 వేలు సాయం చేస్తే, ఆ డబ్బులు తీసుకోవద్దని బాధితులను వైసీపీ నాయకులు బెదిరించారని ఆరోపించారు. చేతనైతే సాయం చేయాలని కానీ ఇలా పేదలను కూడా బెదిరించడం వారికే చెల్లిందన్నారు. ఎవరైనా ఆడపిల్లల జోలికి వెళ్లినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా మోకాళ్లు విరగ్గొట్టి జగదాంబ సెంటర్‌లో నిలబెడతామన్నారు. విశాఖలో అందమైన రుషికొండకు బోడిగుండు కొట్టించారని, మళ్లీ ... మిగతా 8వ పేజీలో

అమ్మవారి మాన్యం హాంఫట్

లంకధర్మవరంలోని పైడితల్లమ్మ ఆలయానికి చెందిన 11.81 ఎకరాలు స్వాహా

- ధర్మకర్త వంశంలో కొందరితో పాటు కౌలుదారులు ఏకమై విక్రయం
- జీడి చెట్లు నరికించి చదును చేసిన రియల్టర్
- మంత్రులు, రాజకీయ నాయకుల ప్రమేయం ఉండడంతో పట్టించుకోని అధికారులు



జీడితోట నరికి చదును చేసిన దృశ్యం

అచ్యుతాపురం, మే 2:

వెదురువాడ పంచాయతీ లంకధర్మవరంలోని పైడితల్లమ్మ అమ్మవారి ఆలయానికి చెందిన 11.81 ఎకరాల భూమి గుట్టు చప్పుడు కాకుండా చేతులు మారిపోయింది. ఆ భూమిని ఓ రియల్టర్ కొనుగోలు చేసి లేఅవుట్ కూడా వేసేశారు. అంతేకాకుండా రాంబిల్లి ప్రధాన రోడ్డు నుంచి లేఅవుట్‌కి 40 అడుగుల వెడల్పున రోడ్డు కూడా వేసి ప్లాట్లు విక్రయానికి పెట్టారు. దీని వెనుక మంత్రులు, ప్రముఖ రాజకీయ నాయకులు ఉండడంతో అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల్లో ఒకరు ఆరోపిస్తున్నారు.

వెదురువాడ పంచాయతీ లంకధర్మవరంలో సర్వే నంబర్ 200/1లో 8 సెంట్లు, 200/2లో 12.26 ఎకరాలు, 198/7లో 3.55 ఎకరాలు కలిపి మొత్తం 15.81 ఎకరాల భూమి పైడితల్లి అమ్మవారి మాన్యంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. దీనిలో సర్వే నంబర్ 200/1లో ఉన్న 8 సెంట్లలో ఆలయం ఉంది. 198/7లో ఉన్న 3.55 ఎకరాలను బారిక మాన్యంకి కేటాయించారు. దీనిలో నాలుగు ఎకరాలు 1983కి ముందే ధర్మకర్తలే విక్రయించేశారు. మిగిలిన 11.81 ఎకరాలను రైతులకు కౌలుకిచ్చి దానిపై వచ్చే ఆదాయంతో ఏటా మార్చిలో అమ్మవారి పండగను నిర్వహిస్తారు. కాగా రాంబిల్లి వద్ద ప్రస్తుతం నేవల్ బేస్ నిర్మిస్తుండడంతో అచ్యుతాపురం- ఎలమంచిలి ప్రధాన రహదారిలో గల వెంకటాపురం జంక్షన్- రాంబిల్లి రోడ్డుని నాలుగు లేన్లుగా విస్తరించారు. పైడితల్లమ్మ మాన్యం రోడ్డును ఆనుకొని ఉండడంతో ఎకరా రూ.2 కోట్లు పలుకుతోంది. దీనికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, అధికారుల అండతో ధర్మకర్తల్లో కొందరితో పాటు కౌలుదారులు ఏకమై ఎకరా కేవలం రూ.12 లక్షలకు విక్రయించేశారని తెలిసింది. రియల్టర్‌కి పక్కా రిజిస్ట్రేషన్ కూడా చేయించారని సమాచారం.

ఇది ముమ్మాటికీ అమ్మవారి మాన్యం..

ఈ భూమి ముమ్మాటికీ అమ్మవారి మాన్యమేనని వంశపారంపర్య ధర్మకర్తల్లో ఒకరైన లంక ఆదినారాయణ విలేకరులకు తెలిపారు. విశాఖకు చెందిన క్రిష్టియన్ ఇనాందార్ రాయితి గజపతిరావు నుంచి తమ తాత గార్లయిన లంక పెదప్పన్న, చినప్పన్నలతో పాటు జాగారపు ఆదిగాడు కలిసి 20 ఎకరాలు 1916 జూలై 15న కొనుగోలు చేశారన్నారు. అప్పటికే ఈ భూమి సరిహద్దుల్లో అమ్మవారి మాన్యం ... మిగతా 8వ పేజీలో

జీడి తోటలో వృద్ధురాలి హత్య

రామచంద్రపురం శివారులో ఘటన

- పోలీసుల అదుపులో అనుమానితుడు!



మృతురాలు సూర్యం (ఫైల్ ఫొటో)

కృష్ణాదేవిపేట, మే 2: గొలుగొండ మండలం లింగంపేట పంచాయతీ రామచంద్రపురం శివారు జీడితోటలో ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. మృతురాలి బంధువు ఫిర్యాదు మేరకు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రావికమతం మండలం మర్రివలసకు చెందిన అమ్మిరెడ్డి సూర్యం(60) గొలుగొండ మండలం లింగంపేట పంచాయతీ రామచంద్రపురంలో గల తన చెల్లెలు కోలా రమణమ్మ ఇంటి వద్దకు వచ్చి గత కొంతకాలంగా ఉంటోంది. లింగంపేటలోని చేబోలు మల్లేశ్‌కు చెందిన జీడితోటను ఏఎల్‌పురం గ్రామానికి చెందిన యల్లపు నూకరాజుకు పదేళ్ల లీజుకు ఇచ్చారు. ఆ తోటలో జీడిపిక్కలు సేకరించేందు కూలి పనులకు ఈ వృద్ధురాలు వెళుతోంది. ఎప్పటిలాగే బుధవారం జీడిపిక్కలు సేకరించడానికి తోటలోకి వెళ్లింది. రాత్రి అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు జీడితోటలో వెతికారు. ఇంతలో అక్కడ ఆమె విగతజీవిగా కనిపించింది. దీనిపై సమాచారం అందుకున్న నర్సీపట్నం డీఎస్పీ మోహన్, నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి, గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు, నాతవరం ఎస్ఐ రామారావు, కృష్ణాదేవిపేట ఎస్ఐ ఉపేంద్ర ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి ఒంటిపై దుస్తులు లేవు. ఆమె తలపై, ఒంటిపై గాయాలు ఉండడంతో హత్యగా పోలీసులు భావిస్తున్నారు. ఆమె నిరుపేద కావడంతో నగదు, బంగారం వంటివి ఏమీలేదు. అయితే ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించే క్రమంలో హత్యచేసి ఉండవచ్చుననే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నట్టు తెలిసింది. క్లూస్ టీమ్ ఎస్ఐ టి.విజయ, డాగ్‌స్క్వాడ్ బృందం ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనకు సంబంధించి ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

ఉద్యోగులు అష్టకష్టాలు

పీఎఫ్ రుణాలకూ ఏళ్లుగా ఎదురుచూపులు

- గతంలో దరఖాస్తు చేసిన 15 రోజుల్లోనే జమ
- ప్రస్తుతం ఏళ్లు గడుస్తున్నా చెల్లింపులు లేవు
- ఏపీ జీఎల్ఐసీకి దరఖాస్తు చేసినా అంతే..
- ఆరోగ్య శాఖలో వేలాది మంది దరఖాస్తులు పెండింగ్
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల్లోనూ తీవ్ర జాప్యం
- ఇతర శాఖల ఉద్యోగులకూ అదే పరిస్థితి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నెల జీతం నుంచి కొంత మొత్తం పీఎఫ్, ఏపీజీఎల్ఐ పేరిట దాచుకుంటారు. అవసరమైన సందర్భంలో రుణాలు, పార్ట్ పేమెంట్ల పేరిట దరఖాస్తు చేసి కొంత మొత్తాన్ని తిరిగి తీసుకుంటారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇలా దాచుకున్న డబ్బును కూడా తిరిగి ఇవ్వడం లేదు. అత్యవసర సమయాల్లో దరఖాస్తు చేసినా నెలల తరబడి వాటికి స్పందన కనిపించడం లేదు. ఫలితంగా అప్పులు చేసి అవసరాలను తీర్చుకోవాల్సిన దుస్థితి ఎదురవుతోందని ఉద్యోగులు వాపోతున్నారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఉద్యోగులకు జగన్ సర్కార్ చుక్కలు చూపించింది. జీతాలతోపాటు ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లింపుల్లోనూ నిర్లక్ష్యం ప్రదర్శించింది. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. గడిచిన నాలుగేళ్లుగా ఆరోగ్య శాఖలో పనిచేసే వందలాది మంది ఉద్యోగులు వివిధ రకాల బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని చెబు తున్నారు. దీంతో అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఆరోగ్య శాఖ ఉద్యోగుల్లో సుమారు రెండు వేల మంది వివిధ అవసరాల కోసం జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) నుంచి రుణాల కోసం దరఖాస్తు చేశారు. ఏడాది, రెండేళ్లు దాటుతున్నా వారి దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. కార్యాలయాల్లో ఆరా తీస్తే నిధులు లేవనే సమాధానం వస్తోంది. ప్రతి ఉద్యోగి జీతంలో ప్రతినెలా కొంత మొత్తాన్ని జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌కు జమ చేస్తారు. పిల్లలు చదువులు, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు రుణాలు లేదా పార్ట్ పేమెంట్ రూపేణా ఇందులోనుంచి కొంత మొత్తాన్ని తీసుకుని అవసరాలను తీర్చుకుంటారు. అయితే గత నాలుగేళ్లుగా దరఖాస్తు చేసుకోవడం మినహా చెల్లింపులు లేవని, ఈ మూడు నెలల్లో అతి కొద్దిమందికి మాత్రమే అందాయని చెబుతున్నారు.

సాధారణంగా జీపీఎఫ్ నుంచి రుణాలు లేదా పార్ట్‌పేమెం ట్ కోసం ఉద్యోగి దరఖాస్తు చేసిన 15 రోజుల్లోనే అతని ఖాతాలోని నిల్వలో నిబంధనల మేరకు నిధులు బ్యాంకు ఖాతాలో జమవుతాయి. వైసీపీ అధికారంలోకి వచ్చే వరకు జీపీఎఫ్ విషయంలో రాష్ట్రంలోని ఏ ఉద్యోగికీ ఇబ్బందులు ఎదురుకాలేదు. కానీ జగన్ అధికారం చేపట్టాక దాచుకున్న డబ్బు తీసుకోవాలన్నా నెలలకొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పాటు ఏపీ గవర్నమెంట్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఏపీజీఎల్ఐ) కోసం కూడా సుమారు 500 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడిచినా ఒక్క రూపాయి కూడా జమ కాలేదని వాపోతున్నారు. ఏపీజీఎల్ఐ కి ప్రతి ఉద్యోగి జీతంలో నెలనెలా ఆరు శాతం జమవుతుంది. ఈ మొత్తాన్ని అవసరమైనప్పుడు తీసుకునే వెసులుబాటు కూడా ఉంటుంది. ఇలా ఒక్కో ఉద్యోగికి సీనియారిటీని బట్టి కనీసం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వస్తుంది. దరఖాస్తు ... మిగతా 8వ పేజీలో

బాబోయ్ ఎండలు

అత్యధికంగా రావికమతంలో 42.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

అనకాపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ప్రారంభమవుతున్న ఎండలు సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతున్నాయి. జిల్లా అత్యధికంగా గురువారం రావికమతంలో 42.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రోలుగుంటలో 41.6, చీడికాడ, చోడవరం, మాడుగులలో 41.5, గొలుగొండలో 41.4, బుచ్చెయ్యపేటలో 41.2, కశింకోట, మాకవరపాలెంలో 40.9, కోటవురట్లలో 40.8, దేవరాపల్లిలో 40.4, కె.కోటపాడు 40.3, నర్సీపట్నంలో 39.9, సబ్బవరంలో 39.4, అనకాపల్లిలో 38.3, మునగపాకలో 38, పాయకరావుపేటలో 37.5, అచ్యుతాపురం, ఎస్.రాయవరంలో 37.4, ఎలమంచిలిలో 37, నక్కపల్లిలో 36.4, పరవాడలో 36.3, రాంబిల్లిలో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల 48 గంటల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.



ఎండ తీవ్రత వల్ల నిర్మానుష్యంగా ఉన్న రావికమతం మెయిన్ రోడ్డు

పాత గొడవలతోనే అచ్చంనాయుడు హత్య: సీఐ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు.

బుచ్చెయ్యపేట, మే 2: బుచ్చెయ్యపేటలో బుధవారం జరిగిన హత్య పాత గొడవల వల్లేనని కొత్తకోట సీఐ అప్పలనాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను తెలిపారు. గ్రామానికి చెందిన తాటికొండ అచ్చంనాయుడికి, కన్నెడ్డి శ్రీనుల మధ్య గత కొంతకాలంగా వివాదాలు జరుగుతున్నాయన్నారు. బుధవారం అచ్చంనాయుడు శ్రీనుని కొట్టాడు. దీంతో కక్షపెంచుకున్న అచ్చంనాయుడు ఇంట్లో ఉన్న కత్తితో శ్రీనుపై దాడిచేసి హత్య చేశాడన్నారు. నిందితుడు శ్రీనును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో జైలుకు తరలించామని సీఐ చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆధారాల్లేని రూ.2.82 లక్షలు సీజ్

అనకాపల్లి టౌన్, మే 2 : పట్టణానికి సమీపంలోని జలగలమదుం జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం ఫ్లయింగ్ స్క్వాడ్ నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ముగ్గురు నుంచి రూ.రెండు లక్షల 82వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు. కశింకోటకు చెందిన టి. వెంకటరావు లారీ టైర్ల కొనుగోలు కోసం వెళుతుండగా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా లక్ష రూపాయలు తనిఖీలో ఆయన వాహనంలో లభించిందన్నారు. అలాగే ఆర్టీసీలో పనిచేస్తున్న రౌతు అప్పారావు నుంచి రూ. 82 వేలు, మునుప్పపురం గోల్డ్‌లో పనిచేస్తున్న కె. హర్షిత నుంచి లక్ష రూపాయలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ సమాచారం మేరకు ఈ నగదును ట్రెజరీకి పంపుతామన్నారు. నగదుకు సంబంధించి ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోవడంతో సీజ్ చేసినట్టు తెలిపారు. నగదుకు సంబంధించి డాక్యుమెంట్లు చూపితే ట్రెజరీ నుంచి నగదును విడుదల చేస్తారని తెలిపారు.

రూ. 7.5 లక్షల నగదు సీజ్

పరవాడ, మే 2 : మండలంలోని కలపాక గ్రామానికి చెందిన జె. అచ్చెన్న గురువారం తన ద్విచక్ర వాహనంపై రూ.ఏడు లక్షల 50వేల నగదుతో పరవాడలోని కెనరా బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు బయలుదేరాడు. స్థానిక సినిమా హాల్ జంక్షన్ వద్ద తనిఖీల్లో భాగంగా అతని వద్ద గల నగదును పోలీసులు గుర్తించారు. నగదుకు సంబంధించి డాక్యుమెంట్లు లేకపోవడంతో ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎన్నికల సంఘం ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో పిటిషన్

నక్కపల్లి, మే 2: గుర్తుల కేటాయింపుపై కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్టు పాయకరావుపేట దళిత బహుజన పార్టీ అభ్యర్థి, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తన పిటిషన్‌పై ఈనెల 3వ తేదీన సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతాయని చెప్పారు. జనసేన పార్టీకి అనుకూలంగా హైకోర్టులో ఎన్నికల సంఘం ఫైల్ చేసిన ఆర్డరును తాను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించానని కృష్ణస్వరూప్ చెప్పారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన పరిశీలకులు


పెదరాంభద్రపురంలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

పాయకరావుపేట రూరల్, మే 2 : మండలంలోని శ్రీరాంపురం, పెదరాం భద్రపురం, మాసాహెబ్‌పేట గ్రామాలలోని 107, 108, 127, 135, 136 పోలింగ్ స్టేషన్లను గురువారం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు డాక్టర్ రాకేష్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో టాయిలెట్స్, మంచినీటి సదుపాయం, కరెంట్ తదితర వాటిని పరిశీలించారు. శ్రీరాంపురం పాఠశాలలో పోలింగ్ స్టేషన్ వద్ద ప్లాట్‌ఫామ్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సరిచేయాలని బీఎల్‌ఓకు సూచించారు. పోలింగ్ స్టేషన్లలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు జిల్లా డ్వామా పీడీ సందీప్ పాయకరావుపేట, నక్కపల్లి తహసీల్దార్లు ఎ. సూర్యనారాయణ, శ్రీధర్, సీఐ పి.అప్పలరాజు, పాయకరావుపేట, నక్కపల్లి ఆర్.ఐలు త్రినాథ్, కన్నబాబు, ఏపీవో హేమలత, అచ్యుత్ పాల్గొన్నారు.

నేటి నుంచి అప్పన్న నిజరూప దర్శనం టికెట్ల విక్రయం

సింహాచలం, మే 2 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం టికెట్ల విక్రయాలను శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభించనున్నట్టు ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రూ. 1500, రూ.1000, రూ.300 టికెట్లు కొనుగోలు చేయనున్న వారు సింహగిరిపై పాత పీఆర్ఓ కార్యాలయంలో లేదా దేవస్థానం అనుమతించిన కొన్ని బ్యాంకులను సంప్రతించాలన్నారు. ఒక దరఖాస్తుపై నాలుగు టికెట్లు మాత్రమే ఇస్తారని తెలిపారు. 3న సాయంత్రం 4 గంటల నుంచి, 7న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు టికెట్ల విక్రయాలు జరుగుతాయని, 8 నుంచి విక్రయాలు నిలిపివేస్తామని చెప్పారు. టికెట్లను ఏపీ టెంపుల్స్ అన్న వెబ్‌సైట్ ద్వారా నేరుగా పొందవచ్చునన్నారు.

దువ్వాడ మీదుగా భువనేశ్వర్, ఎల్‌టీటీ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, మే 2: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం వయా విజయనగరం, దువ్వాడ మీ దుగా భువనేశ్వర్, లోకమాన్య తిలక్ టెర్మినస్ (ఎల్‌టీటీ) మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 08420 నంబరు గల రైలు ఈనెల ఎనిమిది నుంచి వచ్చే నెల 26 వరకు ప్రతి బుధవారం రాత్రి భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 4.43 గంటలకు విజయనగరం, 6.45 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎల్‌టీటీ చేరుతుంది. తిరిగి ఈనెల 10 నుంచి వచ్చే నెల 28 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 1.20 గంటలకు ఎల్‌టీటీలో బయలుదేరి మర్నాడు సాయంత్రం 5.45 గంటలకు దువ్వాడ, రాత్రి 7.20 గంటలకు విజయనగరం, ఆదివారం తెల్లవారుజాము 1.45 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది.

5 నుంచి విశాఖ, హటియా ఎక్స్‌ప్రెస్ రద్దు

విశాఖ, హటియా మధ్య నడుస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీసులను అనివార్య కారణాలతో ఈనెల ఐదు నుంచి జూలై ఒకటి వరకు తాత్కాలికంగా రద్దు చేసామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా విశాఖ నుంచి హటియా వెళ్లే 08559 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల ఐదు నుంచి జూన్ 30 వరకు, అలాగే హటియా నుంచి విశాఖ వచ్చే 08560 నంబరు గల రైలు ఈనెల ఆరు నుంచి జూలై ఒకటి వరకు రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

పవన్ రాకతో కూటమి శ్రేణుల్లో జోష్

- ఆకట్టుకున్న జనసేనాని ప్రసంగం
- అంచనాకు మించి జనం రాక
- టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం
- జనసేన, టీడీపీల్లో పెరుగుతున్న చేరికలు



అచ్యుతాపురం, మే 2: జనసేన నేత పవన్ కల్యాణ్ బుధవారం ప్రచారం చేయడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఈ సమావేశానికి కూటమి నాయకుల అంచనాలకు మించి జనం తరలి వచ్చారు. పవన్ కల్యాణ్ ప్రసంగం ఈ ప్రాంత ప్రజల్ని ఆకట్టుకోవడంతో శ్రేణులను ఉత్సాహపరిచింది. ముఖ్యంగా ప్రస్తుత ఎమ్మెల్యే కన్నబాబు రాజుపై ఇంతవరకు ఎవరూ బహిరంగంగా వ్యాఖ్యలు చేయలేదు. కాని పవన్ కల్యాణ్ వేలాది మంది ప్రజల సమక్షంలో కన్నబాబు రాజుపై ధ్వజమెత్తడం ఈ ప్రాంతీయులకు బాగా నచ్చింది. గ్రామ గ్రామాల్లో ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఫలితంగా జనసేన, టీడీపీల్లో చేరికలు భారీగా పెరుగుతున్నాయి. దీనికి తోడు ఉమ్మడి శ్రేణులు గ్రామాల్లో తిరిగి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే కన్నబాబు రాజు వలె దోచుకోవడం ఉండదని, అభివృద్ధి చేస్తామని చెప్పుకొస్తున్నారు. ముఖ్యంగా యువత పవన్ ప్రసంగానికి ముగ్ధులయ్యారు. నీరు, నిప్పు, నేల, గాలి ఎవరి సొత్తు కాదు, అవి మనవి.. మనందరివి.. వాటిపై వైసీపీ నాయకులు ఎటువంటి హక్కు లేదని ఉద్రేక ప్రసంగం అన్ని వర్గాలను ఆకట్టుకుంది. పవన్ కల్యాణ్ సమావేశంతో వైసీపీ శేణుల్లో కొంత నైరాశ్యం ఏర్పడింది. గ్రామాల్లో ఆ పార్టీ ఎన్నికల ప్రచారాలకు మొక్కుబడిగా జనాలు వస్తుండడం స్థానిక నాయకులకు మింగుడు పడడం లేదు. ఇదే పరిస్థితి ఎన్నికల వరకు కొనసాగితే వైసీపీకి తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని ప్రజలు అనుకుంటున్నారు.

ఎలమంచిలిలో బాలకృష్ణ పర్యటన రేపు

- ఏర్పాట్లను పరిశీలించిన కూటమి నాయకులు

ఎలమంచిలి, మే 2 : ఎలమంచిలిలో ఈనెల 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పర్యటిస్తారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను వారు పరిశీలించారు. పట్టణంలోని దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ విజయానికి మద్దతుగా బాలకృష్ణ పర్యటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు కొఠారు సాంబ, గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఎలమంచిలిలో బాలకృష్ణ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, సుందరపు విజయ్‌కుమార్

775 బాటిళ్ల నకిలీ మద్యం స్వాధీనం

- హోమియోపతి వైద్యంలో వాడే మందును వినియోగించి తయారీ
- ఇద్దరు నిందితులు అరెస్టు


పట్టుకున్న నకిలీ మద్యం గురించి వివరిస్తున్న సీపీ రవిశంకర్ అయ్యన్నార్

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): హోమియోపతి వైద్యంలో వాడే మందును ఉపయోగించి నకిలీ మద్యం తయారుచేస్తున్న వ్యక్తితో పాటు దానిని విక్రయిస్తున్న అతడి భార్యను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి 775 నకిలీ మద్యం బాటిళ్లు, తయారీకి వాడే మరో 290 కార్బో వెజిటబుల్స్, అస్పిడోస్పెర్మా బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను నగర పోలీస్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీ రవిశంకర్ అయ్యన్నార్ వెల్లడించారు.

పెందుర్తిలోని ఒక అపార్టుమెంటులో నకిలీ మద్యం విక్రయిస్తున్నట్టు సెబ్ అధికారులకు సమాచారం అందడంతో స్థానిక పోలీసుల సహాయంతో బుధవారం దాడి చేశారు. ఒడిశా రాష్ట్రం బెర్హంపూర్ నుంచి వచ్చి నివాసముంటున్న లాడి శిరీష (40) హోమియోపతి వైద్య చికిత్సలో వాడే 'బెల్లడోనా' అనే డ్రగ్‌తోపాటు క్యారమెల్ కలర్ ఉపయోగించి తయారుచేసిన నకిలీ మద్యం (స్పూరియాసిస్ లిక్కర్) విక్రయిస్తున్నట్టు గుర్తించారు. శిరీష ఇచ్చిన సమాచారం ఆధారంగా విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలో నకిలీ మద్యం తయారుచేస్తున్న ఆమె భర్త లింగరాజుపాత్రోను అదుపులోకి తీసుకున్నారు. అతను 90 శాతం ఆల్కహాల్ కలిగిన బెల్లడోనా డ్రగ్ బాటిళ్లను కొనుగోలు చేసి, ఒక బాటిల్‌తో రెండు బాటిళ్ల మద్యం తయారు చేస్తున్నట్టు గుర్తించారు. అలా తయారుచేసిన మద్యం బాటిళ్లకు ఇంపీరియల్ బ్లూ, రాయల్‌స్టాగ్ వంటి ప్రముఖ కంపెనీలకు చెందిన ఫేక్‌లేబుళ్లను అతికించి ఇతర జిల్లాలకు సరఫరా చేస్తున్నట్టు విచారణలో తేలింది. దీంతో డెన్‌లో ఉన్న 775 నకిలీ మద్యం బాటిళ్లు, మద్యం తయారీకి ముడి సరకుగా వినియోగిస్తున్న 290 కార్బో వెజిటబుల్స్, అస్పిడోస్పెర్మా బాటిళ్లు సీజ్ చేశారు. కాగా నిందితులు ఇద్దరు ఆరు నెలల కిందట ఒడిశా నుంచి వచ్చి పెందుర్తిలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారన్నారు. గతంలో వీరిపై అనకాపల్లి జిల్లాలో కూడా ఇదే తరహా కేసులు నమోదయ్యాయని సీపీ వెల్లడించారు. ఈ తరహా మద్యం సేవించిన వారిలో ఊపిరితిత్తులు దెబ్బతినడం, గుండె సంబంధిత రుగ్మతలు దరిచేరడం జరుగుతుందని వైద్యులు పేర్కొన్నారు. నిందితులు ఇద్దరిపైనా ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదుచేసి అరెస్టు చేశామన్నారు. వీరిపై పీడీ యాక్ట్ అమలుచేసే ప్రతిపాదన ఉందని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ జాయింట్ సీపీ ఫకీరప్ప, సెబ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన వ్యక్తి జెడ్.గంగవరం వాసే

- నగదు లావాదేవీలే కారణమా.. అన్న కోణంలో దర్యాప్తు
- ఏడుగుర్ని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ


మృతుడు రుత్తల శివశంకర్ (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, మే 2: మండలంలోని జీడిమామిడి తోటలో హత్యకు గురైన యువకుడు జెడ్.గంగవరం గ్రామానికి చెందిన రుత్తల శివశంకర్ (29)గా గుర్తించినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. శివశంకర్ గత రెండేళ్లుగా అచ్యుతాపురం వద్ద ఉన్న ఓ ప్రవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. గత నెల 29వ తేదీ సోమవారం చోడవరం పండగకు వెళతానని, మూడు రోజుల వరకు ఇంటికిరాను అని తల్లిదండ్రులతో చెప్పి బయల్దేరాడు. బుధవారం ఉదయం వరకూ ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు మంగళవారం ఉదయం నుంచి ఫోన్‌చేసినా ఫోన్ పనిచేయలేదని వారు తెలిపారు. అయితే బుధవారం ఉదయం అదే గ్రామంలోని జీడిమామిడి తోటలో మృతిచెంది కనిపించాడు. గ్రామానికి చెందిన రైతు మామిడి మొక్కలను తడిపేందుకు వెళ్లగా ఆ తోటలో యువకుడి మృతదేహం కనిపించడంతో స్థానిక పెద్దలకు తెలిపాడు. వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా పాడైపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానికులతో పాటు కుటుంబ సభ్యులు గుర్తించలేకపోయారు. అయితే శివశంకర్ తీసుకువెళ్లిన బైకు తోటల్లో కనిపించడంతో పాటు మృతుని వద్ద ఉన్న బైకు తాళాలు, చెప్పులు ఆధారంగా చివరకు గుర్తించారు. మృతదేహాన్ని గురువారం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు విచారణను ప్రారంభించిన పోలీసులు జెడ్.గంగవరం గ్రామానికి చెందిన ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే రామన్నపాలేనికి చెందిన ఓ యువకుడ్ని అదుపులోకి తీసుకొని నర్సీపట్నం పోలీసు స్టేషన్‌లో విచారణ జరుపుతున్నారు.

ఇదిలావుంటే, మృతుడు శివశంకర్ తల్లిదండ్రులు ఐదు నెలలు కిందట సుమారు రూ.30 లక్షలకు భూమిని విక్రయించారు. ఆ వచ్చిన డబ్బులో కొంత అప్పులు తీర్చి, మిగిలిన సుమారు రూ. ఐదు లక్షలను కుమారుడు పేరున ఉన్న బ్యాంకు ఖాతాలో వేశారు. ఇదిలావుంటే, శివశంకర్ బ్యాంకు ఖాతాలో గత నెల 29వ తేదీకి రూ.లక్ష మాత్రమే ఉండేదని, చివరకు అదికూడా విత్ డ్రా చేసినట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నగదు లావాదేవీల వల్లే ఈ హత్య చేశారా.., లేక ఇంకేమైనా కారణమా అన్న కోణంలో పోలీసులు విచారణ జరపుతున్నారు.

భారీగా నకిలీ కరెన్సీ స్వాధీనం

నకిలీ గోల్డ్ కాయిన్స్ కూడా... ఆరుగురి అరెస్టు


విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ సునీల్

ఆనందపురం, మే 2: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమిలి క్రాస్ రోడ్డు వద్ద గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో పోలీసులు భారీగా నకిలీ కరెన్సీ నోట్లను, నకిలీ గోల్డ్ కాయిన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ బి.సునీల్ తెలిపిన వివరాలు ప్రకారం...టాస్క్‌ఫోర్స్ సీఐ మన్మథరావు ఇచ్చిన సమాచారం మేరకు ఆనందపురం సీఐ తిరుపతిరావు సిబ్బందితో కలిసి భీమిలి క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో విజయనగరం నుంచి విశాఖపట్నం వస్తున్న కారు డ్రైవర్...క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు చేస్తుండడం చూసి వెనక్కి తిప్పి తప్పించుకోవడానికి యత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఆ వెనకాలే అనుమానాస్పదంగా వస్తున్న ఒక స్కూటీ, బైకును కూడా ఆపి విచారించారు. కారులో ఉన్న ముగ్గురితో పాటు స్కూటీ మీద ఉన్న ఒకరిని, బైక్ మీద ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న పది లక్షల రూపాయల నకిలీ కరెన్సీ నోట్లు, కాపర్‌తో తయారుచేసిన గోల్డ్ కోటెడ్ బిస్కెట్లు, కాయిన్స్, 22 సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, ఆరు కత్తులు, రెండు రాడ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన జి.హేమచంద్రరావు, జన్న సునీల్, హరి శ్రీను, కునుకు హేమంత్‌కుమార్, మంగలపుడి సుబ్బారెడ్డి, ధనాల శ్రీనివాస్ విజయనగరం పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన వారిని, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో అంతా కలిసి పథకం ప్రకారం ఈ పనికి పాల్పడినట్టు ఏసీపీ తెలిపారు. ఫేక్ కరెన్సీ నోట్లను చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా అమెజన్‌లో వారు కొనుగోలు చేసినట్టు చెప్పారు. నకిలీ కరెన్సీని విశాఖలోని సోమేష్ అనే వ్యక్తికి ఇవ్వడానికి తీసుకువెళుతుండగా పట్టుబడ్డారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

హోం ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- పాయకరావుపేట ఆర్వో కె.గీతాంజలి

నక్కపల్లి, మే 2: పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 85 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ సదుపాయం కల్పిస్తామని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నియోజకవర్గం ఆర్వో కె.గీతాంజలి చెప్పారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలో 217 మందికి హోం ఓటింగ్ అవకాశం కల్పించామన్నారు. ఇప్పటికే దరఖాస్తులు సేకరించి,పరిశీలించామని చెప్పారు. సెక్టోరియల్ అధికారుల ఆధ్వర్యంలో భద్రతా సిబ్బంది పర్యవేక్షణలో హోం ఓటింగ్ జరుగుతుందని, ఈ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేస్తామని చెప్పారు. ఈనెల 3, 4, 5 తేదీలలోనూ, 7, 8 తేదీల్లో హోం ఓటింగ్ జరుగుతుందని చెప్పారు.

క్రైం... crime news

పోలీసులపై దాడి ఘటనలో నలుగురి అరెస్టు

ఎలమంచిలి, మే 2: ఎలమంచిలి-అచ్యుతాపురం రోడ్డులో మంగళవారం రాత్రి రెండు కార్లలోని వ్యక్తుల మధ్య జరిగిన తగాదాలో పోలీసులపై దాడి చేసిన ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ గఫూర్ గురువారం తెలిపారు. దాడి ఘటనలో దర్యాప్తు చేసి రాంబిల్లి మండలం లాలం కోడూరుకు చెందిన ఎల్.మోహన్, చిరంజీవి, సందీప్, ఆర్.గంగరాజులను అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి : ఏడుగురి అరెస్టు

సబ్బవరం, మే 2: మండలంలోని వెదుళ్లనరవలో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేసి, ఏడుగురుని అరెస్టు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. వెదుళ్లనరవ ఆంజనేయస్వామి ఆలయం వెనుక కొంతమంది పేకాట ఆడుతున్న సమాచారం పోలీసులకు అందింది. సీఐ ఆదేశాల మేరకు హెచ్‌సీ సత్యనారాయణ సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న కూర్మన్నపాలెం, వడ్లపూడి, టౌన్ కొత్తరోడ్డు, కంచరపాలెం తదితర ప్రాంతాలకు చెందిన ఏడుగురు పట్టుబడ్డారు. మరికొంతమంది పారిపోయారు. పట్టుబడ్డ వారి వద్ద నుంచి రూ.62,120 నగదును స్వాధీనం చేసుకొని, అరెస్టు చేశామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

ముగ్గురు యువకుల వీరంగం

- లారీ, ఆర్టీసీ బస్సులపై దాడి

బుచ్చెయ్యపేట, మే 2: బీఎన్ రోడ్డులో తాచేరు వంతెన డ్రైవర్షన్ రోడ్డు వద్ద గురువారం ముగ్గురు యువకులు వీరంగం సృష్టించడంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. మాడుగుల నుంచి చోడవరం వైపు బీఎన్ డైవర్షన్ రోడ్డుపై లారీ, అనకాపల్లి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు వస్తోంది. ఎదురుగా వస్తున్న ముగ్గురు యువకులు ఆర్టీసీ బస్సుకు తమ బైక్‌ను అడ్డంగా పెట్టి బస్సు అద్దాలపై పగులగొట్టి తనపై దాడి చేసినట్టు డ్రైవర్ కె. త్రినాధరావు చెబుతున్నారు. దీంతో బస్సు వెనక ఉన్న లారీ డ్రైవర్ ప్రశ్నించడంతో ఆ యువకులు ఆ డ్రైవర్‌తోపాటు లారీలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలపై దాడి చేశారు. ఈ సమయంలో ఆటుగా ఆర్మీ జవాన్ తుపాకీ వస్తుండడంతో ఆ ముగ్గురు యువకులు పరారయ్యారు. ఈ దాడిలో లారీ, ఆర్టీసీ బస్సు అద్దాలు దెబ్బతిన్నాయి. అనంతరం బస్సులోని ప్రయాణికులు ఆటుగా వస్తున్న అనకాపల్లి డిపోకి చెందిన మరో బస్సులో ఎక్కించారు. ఈ దాడిపై బుచ్చెయ్యపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు బస్సు డ్రైవర్ త్రినాధరావు తెలిపారు.

వైసీపీ దాడిలో జనసైనికుడికి గాయాలు


వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన పల్లా గోవింద్

లంకెలపాలెం, మే 2: పెదముషిడివాడలో ప్రచారం నిర్వహిస్తున్న జనసైనికుడిపై వైసీపీ కార్యకర్త దాడి చేసి గాయపరిచాడు. గురువారం ఈ సంఘటన చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా వున్నాయి. జనసేనకు చెందిన పల్లా గోవింద్ పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త దాలిబోయిన అప్పారావు తన అనుచరులతో కలిసి అడ్డుకున్నాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అప్పారావు ఒక్కసారిగా గోవింద్‌పై పిడి గుద్దులతో విరుచుకుపడ్డాడు. దీంతో గోవింద్ ముఖంపై గాయమైంది. వెంటనే అతన్ని అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ అండతోనే తమపై దాడికి పాల్పడ్డారని జనసైనికులు ఆరోపించారు. ఇదిలావుంటే ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపారు.

మూడెకరాల్లో చెరకు, సరుగుడు తోటలు దగ్ధం


దగ్ధమైన తోటలను పరిశీలిస్తున్న ఉప సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు మోదునాయుడు,సూర్యనారాయణ

రావికమతం, మే 2: స్థానిక మరిడమ్మ గుడి సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో చెరకు మొక్కతోటలు, సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. ఎవరో కాల్చిపారేసిన చుట్ట లేదా సిగరెట్ వల్ల జరిగిన ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన మజ్జి నాగేశ్వరావు, నారంశెట్టి గంగరాజు,పెదఅప్పారావు, గుమ్మాల నారాయణరావు, నారంశెట్టి చినఅప్పారావు, రమణమ్మ, మహాలక్ష్మినాయుడు, రాజులమ్మలకు చెందిన మూడెకరాల్లో తోటలు కాలిబూడదయ్యాయి. సుమారు లక్షన్నర ఆస్తినష్టం వాటిల్లినట్టు బాధిత రైతులు వాపోయారు. కూత వేటు దూరంలోనే అగ్నిమాపక కేంద్రం ఉన్న ఫలితంలేకపోయిందని వాపోయారు. ఈ కేంద్రంలో ఉన్న అగ్నిమాపక శకటం మరమ్మతు పాలుకావడంతో సేవలు నిలిచిపోయాయన్నారు. ఈ తోటలను రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీ సభ్యులు గంజి సూర్యనారాయణ, వేపాడ నాగేశ్వరావు, టీడీపీ నాయకులు పి.సత్యనారాయణ,జనసేన నాయకులు గంజి శ్రీను, ముక్కారామసూరి తదితరులు పరిశీలించి బాధిత రైతులను ఓదార్చారు.

సారా స్థావరాలపై ఎస్‌ఈబీ పోలీసుల దాడులు

- వెయ్యి లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

పాయకరావుపేట రూరల్, మే 2: మండలంలోని పాల్తేరు గ్రామ శివారు చెరువు వద్ద గురువారం నాటు సారా స్థావరాలపై పాయకరావుపేట, తుని ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నిర్వహించిన దాడులలో వెయ్యి లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.ధర్మారావు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బి.విజయభాస్కరరావు ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా డీటీఎఫ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో పాయకరావుపేట, తుని ఎస్‌ఈబీ పోలీసులు నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించామన్నారు. అదేవిధంగా కాకినాడ జిల్లా తొండంగి మండలం యల్లయ్యపేట శివారు సముద్ర తీరంలో 1,600 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు తెలియజేశారు. దాడులలో తుని ఎస్‌ఈబీ సబ్‌ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

16 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మే 2 : కన్నూరు పంచాయతీ పరిధి మడకపాలెం గ్రామానికి చెందిన సేనాపతి సోమునాయుడు, పరవాడ గ్రామానికి చెందిన నున్న రాఘవేంద్రరావు కలిసి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 16 క్వార్టర్ మద్యం బాటిళ్లను గురువారం రాత్రి కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు ఏఎస్ఐ డీవై నాయుడు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని, నిందితులిద్దరిపైన కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

తొలి విడత చందనం అరగదీతకు సన్నాహాలు

- నేడు ఉదయం 7 గంటలకు సాన ముహూర్తం

సింహాచలం, మే 2 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఈనెల 10న తొలి విడత చందనం సమర్పించేందుకు అవసరమైన గంధం అరగదీతకు అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. తమిళనాడు అటవీ ప్రాంతం నుంచి బహిరంగ వేలం ద్వారా గతేడాది కొనుగోలు చేసి ఆలయ పద్మనిధిలో భద్రపరిచిన మంచి గంధపు చెక్కలను గురువారం ఈఓ శ్రీనివాసమూర్తి సమక్షంలో తీసి కార్పెంటర్‌కు ముక్కలు కోసేందుకు అందజేశారు. సుమారు 32 కిలోల తూనిక గల పెద్ద చెక్కలను ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది అరగదీసేందుకు అనుకూలంగా అడుగు పొడవు గల ముక్కలుగా కోసి సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి గంధం అరగదీయనున్నారు. కాగా స్వామివారిపై ఏటా 12 మణుగుల శ్రీచందనం పైపూతగా వేయడం ఆనవాయితీ. దాన్ని నాలుగు విడతలుగా సమర్పిస్తారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	123.00
లైవ్ ధర	143.00
విత్ స్కిన్	256.00
స్కిన్ లెస్	266.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఉండేది ఇక్కడ... ఓటు అక్కడ!

మీకు తెలుసా!

జీవీఎంసీ 77వ వార్డులో సగం విశాఖపట్నం జిల్లా, మరో సగం అనకాపల్లి జిల్లా పరిధిలో ఉంది. జిల్లాల పునర్విభజనలో పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఓ జిల్లాగా ప్రకటించారు. అయితే విలీన పంచాయతీలను మాత్రం విశాఖ జిల్లాలోనే ఉంచారు. ఈ ప్రాంతంలోని ఓటర్లు పెందుర్తి అసెంబ్లీకి, అనకాపల్లి పార్లమెంట్‌కు ఓటు వేయాల్సి ఉంటుంది.కానీ నివసించేది మాత్రం విశాఖపట్నం జిల్లా, పెదగంట్యాడ మండలం. ఈ ప్రాంతం మొత్తం గాజువాక జోనల్ పరిధి. 77వ వార్డులోనే ఉంటుంది.

● ఉక్కుటౌన్‌షిప్

నమ్మించి... మోసం

జగన్‌పై నిరుద్యోగుల ఆగ్రహం



(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)

రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు నిరుద్యోగ యువతీయువకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో తమకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్న భావన ఎక్కువమందిలో కనిపిస్తోంది. మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇస్తామని, ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామని పాదయాత్ర సమయంలో, గత ఎన్నికల ముందు హామీ ఇచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి గురించి పట్టించుకోలేదన్న అభిప్రాయాన్ని నిరుద్యోగులు వ్యక్తంచేస్తున్నారు. ఏ పార్టీ అయినా సరే...తమను కనీసం ఓటర్లుగా అయినా గుర్తించాలని నిరుద్యోగులు కోరుకుంటున్నారు.

- మెగా డీఎస్సీ, ఏటా జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టు భర్తీకి 2019 ఎన్నికల సమయంలో జగన్ హామీ
- ఒక్కటీ నెరవేర్చలేదంటున్న నిరుద్యోగులు
- నోటిఫికేషన్ కోసం ఐదేళ్ల పాటు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశామంటూ ఆవేదన
- ఇచ్చిన హామీ నిలబెట్టుకునే వారికి ఈసారి ఓటు వేస్తామంటున్న యువత
- ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు రంగంలో కూడా అవకాశాలు కల్పించాలని డిమాండ్



ఏటా ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడంతోపాటు ఉపాధి మార్గాలను చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుద్యోగులకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికను విడుదల చేయాలని అడుగుతున్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని అందుకు అనుగుణంగా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్టయితే నిరుద్యోగుల సంఖ్యను తగ్గించడానికి అవకాశం ఉంటుందని ఉపాధ్యాయ పోస్టుకు ప్రిపేరవుతున్న రామలక్ష్మి అనే యువతి తెలిపింది. నిరుద్యోగులకు మేలు చేస్తామన్న పార్టీకే వచ్చే ఎన్నికల్లో ఓటేస్తామని రాజేష్ అనే నిరుద్యోగి పేర్కొన్నాడు. మోసపూరిత హామీలు ఇచ్చే పార్టీలకు తగిన బుద్ధి చెబుతామన్నాడు.

ఏటా పోస్టులు భర్తీ చేయాలి..

ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలు ఏటా భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ నిరుద్యోగ యువత నుంచి వినిపిస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను..తరువాత విస్మరిస్తున్నారని, అలా చేయకుండా అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయాలని పోలీస్ శాఖలో పోస్టు కోసం సిద్ధమవుతున్న తరుణ్ పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసి కళ్లు కాయలు కాశాయని ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు పరిశ్రమలు, ఐటీ, ఇతర రంగాల్లోనూ యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా ప్రణాళికతో వ్యవహరించాలని, అప్పుడే నిరుద్యోగం తగ్గుముఖం పడుతుందని ఎంవీపీ కాలనీకి చెందిన రాజు అనే యువకుడు పేర్కొన్నాడు. స్వయం ఉపాధి మార్గాల వైపు వెళ్లాలనుకునే నిరుద్యోగ యువతకు ప్రభుత్వాలు అండగా ఉండాలని, ఈ మేరకు సబ్సిడీతో కూడిన రుణాలను అందించాలని లక్ష్మణ్ అనే యువకుడు అభిప్రాయపడ్డాడు.

ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాం



నిరుద్యోగుల గురించి ఆలోచించే ప్రభుత్వాలు రావాలి. ఎన్నికల ముందు యువతకు ఎన్నో చేస్తామని చెబుతుంటారు. ఆ తరువాత మరిచిపోతుంటారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే వారి కోసం ఏడాదికి ఒకసారైనా నోటిఫికేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రిపరేషన్ సమయంలో ఆర్థిక భరోసా కల్పించేలా నిరుద్యోగ భృతి ఇవ్వడం వల్ల కొంత మేలు కలుగుతుంది. వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులకు మేలు చేస్తామనే పార్టీలపక్షానే ఉంటాం. ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాం.

- ఎంఏ నాయుడు, విశాఖపట్నం

ఉద్యోగాలు ఇస్తామనే పార్టీలను గెలిపిస్తాం



అధికారంలోకి వస్తే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఐదేళ్ల క్రితం జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అలాగే ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామన్నారు. ఆ క్యాలెండర్ ఎప్పుడు విడుదల చేస్తారా...అని ఎదురుచూస్తూనే ఉన్నాం. నేటికీ దానిని నెరవేర్చలేకపోయారు. టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో డీఎస్సీ ప్రకటనతో పాటు ఉద్యోగాలు భర్తీచేస్తామని ప్రకటించడం సంతోషంగా ఉంది. ఉద్యోగాలు వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది. ఆటువంటి పార్టీలను అధికారంలోకి తీసుకువస్తే భవిష్యత్తు బాగుంటుందని భావిస్తున్నాం.

-ఎం.క్రాంతికుమార్, అనకాపల్లి

యువత మార్పు కోరుకుంటుంది



గడచిన ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధి విషయంలో బాగా వెనుకబడింది. యువతకు ఉద్యోగ అవకాశాలు లేవు. ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్, జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ హామీలు అమలుకు నోచుకోలేదు. రాష్ట్రానికి రాజధాని ఏదీ అంటే చెప్పలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. అందుకే ప్రజలు, యువత రాష్ట్రంలో మార్పు కోరుకుంటుంది.

- కురచా శివకుమార్, నర్సీపట్నం

వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసంచేసింది



వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మించి మోసం చేసింది. గ్రామ సచివాలయం మినహా ఏ శాఖలోనూ ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదు. డీఎస్సీ కోసం ఐదేళ్లుగా ఎదురుచూసినా ఫలితం లేకుండాపోయింది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కూటమి అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ తీస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ఇస్తామంటున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే ఆశ కలుగుతున్నది. నా ఓటు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే వేస్తాను.

- బాకూరు రాఘవేంద్రరాజు, యర్రబొమ్మలు, చింతపల్లి

నిరుద్యోగులకు వైసీపీ అన్యాయం



నిరుద్యోగులకు ప్రభుత్వాలు అండగా ఉండాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. గడిచిన ఎన్నికల్లో ఏటా జాబ్ కేలండర్ ఇస్తామని చెప్పి..వైసీపీ నిరుద్యోగులకు తీరని అన్యాయం చేసింది. గడిచిన ఐదేళ్లలో ఒక్క జాబ్ కేలండర్ కూడా విడుదల చేయలేదు. నోటిఫికేషన్ల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశాం. ఎన్నికలకు దగ్గరలో నామమాత్రపు పోస్టులతో గ్రూప్ 1, గ్రూప్ 2 నోటిఫికేషన్ విడుదల చేశారు. పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో నోటిఫికేషన్లు విడుదల చేయాలి. అప్పుడే నిరుద్యోగ యువతకు మేలు చేకూరుతుంది. ఆ దిశగా ఆలోచించే, ఆచరణ చేస్తాయని భావించే పార్టీకే వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తాం.

- కె.గురుమూర్తి, విశాఖపట్నం

నోటిఫికేషన్ కోసం ఐదేళ్లు ఎదురుచూశా



గడిచిన ఎనిమిదేళ్లుగా పోలీస్ శాఖలో ఉద్యోగం కోసం కష్టపడుతున్నాను. ఒకసారి త్రుటిలో అవకాశాన్ని కోల్పోయాను. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారైనా నోటిఫికేషన్ రాకపోతుందా..? అని ఆశగా ఎదురు చూశాను. ఎన్నికలకు ఏడాది ముందు నోటిఫికేషన్ ఇచ్చారు. తీరా ఎన్నికల కోడ్, ఇతర కారణాలతో దానిని కూడా పూర్తి చేయలేదు. ఎనిమిదేళ్లపాటు ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపరేషన్‌లో ఉండి సమయాన్ని, డబ్బును వృథా చేసుకున్నాను. నెలకు కనీసం ఐదు వేలు చొప్పున ప్రిపరేషన్‌కు ఖర్చు అవుతోంది. గడిచిన ఎనిమిదేళ్లలో ఐదు లక్షల రూపాయలు ఖర్చు తప్ప..కుటుంబానికి నా వల్ల ఉపయోగం లేకుండా పోయింది. ఏ ప్రభుత్వం అయినా ముందుగా నిరుద్యోగుల ఇబ్బందులు పరిష్కరించడంపై దృష్టిసారించాలి. ప్రభుత్వశాఖల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ఉన్న ఇబ్బందులు ఏమిటో అర్థం కావడం లేదు. నిరుద్యోగులకు అండగా ఉంటామని చెప్పే ప్రభుత్వాన్ని ఎన్నుకుంటాం.

- ఉమా రామకిరణ్, విశాఖపట్నం

నిరుద్యోగులకు మేలు చేసే వారికే ఓటు



నిరుద్యోగులకు మేలు చేస్తామనే పార్టీలకే ఓటు వేస్తాం. మేనిఫెస్టోలో చేర్చిన ప్రతి అంశాన్ని అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే అమలు చేయాలి. నిరుద్యోగులకు మేలు చేసేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. కానిస్టేబుల్ ఉద్యోగం కోసం గడిచిన ఐదేళ్ల నుంచి ప్రిపేర్ అవుతున్నా. ఏడాదిన్నర కిందట నోటిఫికేషన్ ఇచ్చారు. అది పూర్తి చేయలేదు. ఎప్పుడు పూర్తవుతుందో తెలియడం లేదు. వచ్చే ప్రభుత్వాలు అయినా దీన్ని వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగులకు ఏ పార్టీ మేలు చేస్తుందే..ఆ పార్టీకే ఓటు వేయాలని నిర్ణయించుకున్నా. మా స్నేహితులంతా అదే మాట అంటున్నారు.

- వి.గౌరి నాయుడు, విశాఖపట్నం

అరకులో గెలుపెవరిదో?

- నియోజకవర్గం ఏర్పాటయ్యాక మూడుసార్లు ఎన్నికలు
- తొలిసారి టీడీపీ... ఆ తర్వాత రెండుసార్లు వైసీపీ అభ్యర్థుల విజయం



చెట్టి ఫాల్గుణ



కిడారి సర్వేశ్వరరావు



సివేరి సోమ



పాంగి రాజారావు



మత్స్యలింగం

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఎస్.కోట సెగ్మెంట్ పరిధిలో గల అరకులోయ, అనంతగిరి మండలాలు, పాడేరు నియోజకవర్గ పరిధిలో ఉన్న డుంబ్రిగుడ, హుకుంపేట, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలతో 2008లో అరకులోయ నియోజకవర్గం ఏర్పాటైంది. ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 2,32,337 మంది ఓటర్లు ఉన్నారు.

అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి మూడు దఫాలు ఎన్నికలు జరిగాయి. 2009లో మొదటిసారి జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సివేరి సోమ 425 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి వంజంగి కాంతమ్మపై గెలుపొందారు. సోమకు 34,959 ఓట్లు రాగా, కాంతమ్మకు 34,554 వచ్చాయి. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి తిరిగి సివేరి సోమ పోటీ చేయగా, వైసీపీ తరఫున కిడారి సర్వేశ్వరరావు నిల్చున్నారు. సోమపై సర్వేశ్వరరావు 34,053 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సర్వేశ్వరరావుకు 63,,700 ఓట్లు రాగా, సివేరి సోమకు 29,647 వచ్చాయి. అయితే రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో మూడేళ్ల అనంతరం కిడారి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 ఎన్నికల ముందు సర్వేశ్వరరావు, సోమ ఇద్దరూ మావోయిస్టుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సర్వేశ్వరరావు కుమారుడు శ్రావణ్‌కుమార్‌కు చంద్రబాబునాయుడు మంత్రి పదవి ఇచ్చారు. అదేవిధంగా 2019 ఎన్నికల్లో టికెట్ ఇచ్చారు. వైసీపీ తరఫున చెట్టి ఫాల్గుణ, ఇండిపెండెంట్‌గా సియ్యారి దొన్నుదొర పోటీ చేశారు. దొన్నుదొరపై ఫాల్గుణ 25,481 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. చెట్టి ఫాల్గుణకు 53,101 ఓట్లు రాగా, దొన్నుదొరకు 27,620 వచ్చాయి. ఎన్నికల అనంతరం దొన్నుదొర తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈసారి దొన్నుదొరనే పార్టీ అభ్యర్థిగా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆయన ప్రచారం కూడా ప్రారంభించారు. అయితే ఆ తరువాత మారిన సమీకరణల్లో అరకులోయ సీటును తెలుగుదేశం పార్టీ బీజేపీకి ఇవ్వాల్సి వచ్చింది. ప్రస్తుతం కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) తరఫున పాంగి రాజారావు, వైసీపీ తరఫున మత్స్యలింగం పోటీలో ఉన్నారు. కాంగ్రెస్‌తో సహా పలువురు అభ్యర్థులు పోటీలో ఉన్నా..బీజేపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ జరగనున్నది.

● అరకులోయ


డీ లిమిటేషన్ గురించి తెలుసా!

- జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల ఏర్పాటు
- 1952 నుంచి పెరుగుతూ, తగ్గుతూ వస్తున్న సంఖ్య
- ప్రస్తుతం రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు

జనాభాకు అనుగుణంగా రాష్ట్రంలో పలు దఫాలు అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరుగుతూ, తగ్గుతూ వస్తోంది. 1952, 1955 ఎన్నికల్లో కొన్ని ఉమ్మడి నియోజకవర్గాలుండేవి. వీటిలో ఒక సాధారణ అభ్యర్థి, మరొక రిజర్వుడు అభ్యర్థి ఉండేవారు. ఆ తరువాత ఈ విధానం మారిపోయింది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను విభజించాలన్న డీ లిమిటేషన్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం 175 నియోజకవర్గాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ వివిధ ఎన్నికల సమయంలో ఏ విధంగా పెరిగిందో తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. 1955లో 245 నియోజకవర్గాలుగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తర్వాత ఎన్నికలకు 300 స్థానాలకు చేరింది తర్వాత తగ్గింది. దీనికి కారణం డీ లిమిటేషన్ సిఫార్సులే.

డీ లిమిటేషన్ అంటే...

ఎంతమంది ప్రజలకు ఎంతమంది ప్రజాప్రతినిదులు ఉండాలన్న రాజ్యాంగ నిబంధనల మేరకు డీ లిమిటేషన్ అమల్లోకి వచ్చింది. దేశంలో 1952 నాటికి 494 పార్లమెంటు స్థానాలుండేవి 1962లో 522 పార్లమెంటు, 3,771 అసెంబ్లీ స్థానాలకు పెరిగాయి. 1972లో 543 పార్లమెంటు 3,997 అసెంబ్లీ స్థానాలుండగా ఆ సంఖ్య 2002లో 543 పార్లమెంటు, 4,123 అసెంబ్లీ స్థానాలకు చేరింది. ప్రతి పదేళ్లకు ఒకసారి చేపట్టే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సంఖ్య మారుతుంది. 1953లో చంద్రశేఖర అయ్యర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా 1973లో జేఎల్ కపూర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా పార్లమెంటు సభ్యులుండాలన్న ప్రతిపాదనలతో సంఖ్య పెరిగింది 2002లో నియమితులైన కులదీప్ సింగ్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన సిఫార్సులు 2008 నుంచి అమల్లోకి వచ్చాయి.



రాష్ట్రంలో పెరిగిన అసెంబ్లీ స్థానాలు

1955లో ఆంధ్ర ప్రాంతంలో 140 అసెంబ్లీ స్థానాలు, తెలుగు మాట్లాడే హైదరాబాద్ ప్రాంతంలో 105 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 1962లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో 300 అసెంబ్లీ స్థానాలుండేవి. వాటిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 177, సీపీఐ 51, స్వతంత్రపార్టీ 19, సోషలిస్టు పార్టీ 2, ఇండిపెండెంట్లు 51 మంది ఎన్నికయ్యారు. ఆ తర్వాత జరిగిన 1967, 1972 ఎన్నికల్లో ఎమ్మెల్యేల సంఖ్య 287కి పరిమితమయింది. 1967లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 165, స్వతంత్రపార్టీ29, సీపీఐ 11, సీపీఎం 9 భారతీయ జనసంఘ్ 3, ఇండిపెండెంట్లు 68 మంది, సంయుక్త సోషలిస్టు పార్టీ, రిపబ్లికన్‌పార్టీ ఆఫ్ ఇండియా చెరో స్థానాన్ని గెలుచుకున్నాయి. 1972 ఎన్నికల్లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 219, సీపీఐ 7, స్వతంత్రపార్టీ 2, సీపీఎం ఒకటి, సంపూర్ణ తెలంగాణాప్రజాసమితి ఒకటి, స్వతంత్రులు 57 మంది ఎన్నికయ్యారు. 1978లో ఈ స్థానాలు 294కి చేరాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్(ఐ) 175, జనతా 60, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 30, సీపీఐ 6, సీపీఎం 8, ఇండిపెండెంట్లు 15 మంది ఎన్నికయ్యారు. 2014లో తెలంగాణ ఏర్పడే వరకు ఈ సంఖ్యలో మార్పు రాలేదు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాల సంఖ్య 175గా ఉంది.

- భీమునిపట్నం రూరల్

సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదిగిన పైలా

- పరవాడ నుంచి రెండుసార్లు ఎన్నిక



పైలా అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారు పరవాడ గ్రామానికి చెందిన పైలా అప్పలనాయుడు (నాయుడుబాబు). రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన 1965 నుంచి 1982 వరకూ పరవాడ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ ఆవిర్భావం అనంతరం ఆ పార్టీలో చేరారు. 1983 ఎన్నికల్లో పరవాడ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన భాట్టం శ్రీరామ్మూర్తిపై విజయం సాధించారు. అలాగే 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కోన ఆదినారాయణ రామయ్యనాయుడుపై 13,518 ఓట్ల మెజారిటీతో పైలా అప్పలనాయుడు రెండోసారి విజయం సాధించారు. నియోజకవర్గ చరిత్రలో సర్పంచ్ స్థాయి నుంచి ఎదిగి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తిగా అప్పలనాయుడు రికార్డు సృష్టించారు. ఆయన 2004 డిసెంబరు 10న కన్నుమూశారు. ఆయన సతీమణి విజయలక్ష్మి పరవాడ ఎంపీపీగా పనిచేశారు.

● పరవాడ



ప్రచారంలో రిక్షాల కూటమి!

కూటమి అభ్యర్థులు ప్రచారంలో కొత్త పుంతలు తొక్కుతున్నారు. రిక్షాలపై అభ్యర్థుల చిత్రాలు, వారి గుర్తులతో ప్రచారం చేస్తున్నారు. ఎల్ఐసీ బిల్డింగ్ సమీపంలో ప్రచారానికి వరుసగా వెళ్తున్న రిక్షాలివి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఓటరు మాట

సంక్షేమ పథకాలతో నష్టమే



రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే సంపద పెరగడంతో పాటు, యువతకు ఉపాధి లభిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీలు, భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీనివల్ల రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. తలసరి ఆదాయం పెరుగుతుంది. సంక్షేమపథకాలే పరిపాలన కాకూడదు. పెట్టుబడులు ఆకర్షించే సమర్థత కలిగిన నాయకుడ్ని ముఖ్యమంత్రిని చేయాలి. సమర్థులైన అభ్యర్థులను ఎన్నుకుందాం.

- అనంతకుమార్, మాధవధార

సంపద సృష్టించే వారే నాయకులు



ప్రజాధనాన్ని అనవసరంగా ఖర్చుచేసి, పథకాలకు అప్పులు చేసి, ఆ భారాన్ని పన్నుల రూపంలో ప్రజల మీదే వేసే నేతలను తరిమికొట్టాలి. సంపద సృష్టించి, పరిశ్రమలు, ఉపాధికి ప్రాధాన్యమిచ్చే నాయకుడు పాలకుడు కావాలి. తాయిలాలు, ప్రలోభాలకు లొంగి ఓట్లు వేస్తే భవిష్యత్తు తరాలకు అన్యాయం జరుగుతుంది. భరోసా కల్పించగలిగే నేతలను చట్టసభలకు పంపాలి. **- టీఎన్ కృష్ణమోహన్**, చినముషిడివాడ

ప్రణాళికలున్న నేతలు అవసరం



ప్రజలకు సంక్షేమం అందిస్తూనే రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేయాలి. ఆర్థిక వ్యవస్థను పరిపుష్టి చేయగలిగే ప్రణాళికలు కలిగిన వారు పాలకులైతేనే ప్రజలకు మేలు. యువతరానికి మార్గదర్శకంగా ఉండే వారిని ఎన్నుకుంటే సమాజం సవ్యదిశలో సాగుతుంది. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ముందుకు నడిపించగల అనుభవం, సామర్థ్యం కలిగిన నేతలకు ఓటు వేస్తేనే మంచి జరుగుతుంది.

- దేవర రాజారావు, చోడవరం

రవాణా రంగంలోని వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలి



రవాణా రంగంలో పనిచేస్తూ దేశవ్యాప్తంగా తిరుగుతున్న వాహనాల డ్రైవర్లు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం కల్పించాలి. పోలింగ్ నాటికి వీరంతా ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. తమ నియోజకవర్గంలో ఓటువేసే అవకాశం ఉండదు. ఇలాంటి వారంతా ఓటు వేయలేకపోతున్నారు. నియోజకవర్గానికి చెందిన అభ్యర్థిని ఎన్నుకునేందుకు అవకాశం లేకపోతున్నది. ఇలాంటి వారందరికీ పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పించాలి.

- శ్రీనివాసరాజు, భీమిలి

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

పెన్షనర్ల కష్టాలు

పెన్షన్ సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని సర్కార్ ప్రకటన

బ్యాంకుల వద్ద బారులు తీరిన వృద్ధులు

లావాదేవీలు లేక స్తంభించిన అకౌంట్లు



స్టేట్ బ్యాంక్‌లో పెన్షన్ తీసుకునేందుకు క్యూలో నిలుచున్న పెన్షనర్లు

పాయకరావుపేట, మే 2 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి ఎన్నికల కమిషన్ తప్పించిన నేపథ్యంలో మే నెల సామాజిక పింఛన్ల సొమ్మును పింఛనుదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడంతో పట్టణంలోని బ్యాంకుల వద్ద వృద్ధులు బారులు తీరారు. పింఛను సొమ్ము కోసం బ్యాంకుల వద్ద గంటల తరబడి క్యూ లైన్లలో కష్టాలు పడ్డారు.

మండలంలోని 24 పంచాయతీల్లో మే నెలకు సంబంధించి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర మొత్తం 13,198 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరిలో 9,951 మంది బ్యాంకు అకౌంట్లకు మే నెల పింఛను సొమ్మును అధికారులు జమ చేశారు. అనారోగ్యంతో మంచంపై ఉన్నవారు, దివ్యాంగులు, ఇతర సమస్యలతో ఇంటి నుంచి బయటకు రాలేనివారు 3,247 మందికి సచివాలయ సిబ్బంది బుధవారం నుంచి ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. అదేవిధంగా బ్యాంకు ఖాతాల్లో పింఛను సొమ్ము జమ కావడంతో ఆ మొత్తాన్ని తీసుకోవడానికి పింఛనుదారులకు కష్టాలు మొదలయ్యాయి. గురువారం పాయకరావుపేటలోని అన్ని బ్యాంకుల వద్ద పింఛనుదారుల క్యూలైన్లు కనిపించాయి. అదేవిధంగా ఎస్‌బీఐ బ్యాంకు సర్వీసు సెంటర్ ద్వారా పింఛను తీసుకునేందుకు వెళ్లిన పలువురు పింఛనుదారులకు మెయిన్ బ్యాంకుకు వెళ్లి ఖాతాలో నగదు జమ అయినట్టు స్లిప్పు తెచ్చుకోవాలని నిర్వాహకులు తెలియజేయడంతో వీరు పలుమార్లు ఎండలో తిరగాల్సి వచ్చింది. బ్యాంకుల్లో విత్ డ్రా ఓచరు ఇతరుల సాయంతో రాయించుకోవడం పెద్ద సమస్యగా మారింది. పైగా ప్రస్తుతం ఎండాకాలం కావడంతో పాటు పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతుండడంతో వృద్ధులు వడదెబ్బకు గురయ్యే అవకాశాలున్నాయి. శుక్ర, శనివారాలు బ్యాంకుల వద్ద మరీ రద్దీగా ఉండవచ్చు.

పెన్షన్ కోసం తిప్పలు

అచ్యుతాపురం: పెన్షన్ల కోసం వృద్ధులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వారికున్న బ్యాంకు ఖాతాల్లో లావాదేవీలు జరగకపోవడంతో వాటిని తిరిగి రన్నింగ్‌లోకి తేవాలని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. దీంతో వృద్ధులు ఎన్నో ఇబ్బంది పడుతున్నారు. పెన్షన్‌దారులకు అవగాహన లేకపోవడంతో ఇలా జరుగుతోంది. మండలంలో 11,167 పెన్షన్‌దారులున్నారు. ఇందులో 8,240 మందికి ఆధార్ అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాలకు అధికారులు పింఛన్ మొత్తాన్ని జమ చేశారు. మిగిలిన వారికి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్ద ఇస్తున్నారు. బ్యాంకుల్లో జమ అయిన పింఛన్‌దారులు తమ బ్యాంక్ పుస్తకాలు పట్టుకొని బ్యాంకులకు వస్తున్నారు. అయితే ఇందులో చాలా మంది ఖాతాలు సక్రమంగా లావాదేవీలు జరగకపోవడంతో మురిగిపోయాయి. వంద రూపాయలు బ్యాంకు ఖాతాలో జమ చేసి బతికిస్తే.. మర్నాడు వచ్చి డబ్బులు తీసుకోవచ్చనని బ్యాంకు అధికారులు చెబుతుండడంతో పింఛన్‌దారులు ఈసొరోమని ఇంటికి వెళుతున్నారు. కాని ఎవరికైనా పెన్షన్ మూడో తేదీలోగా అందకపోతే తమకు విషయం చెపితే ఇంటి వద్దకు పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ విషయం తెలియక పింఛన్‌దారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

మత్స్యకార సమస్యలపై సీఎం రమేశ్‌కు వినతి



సీఎం రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అప్పలరాజు

పరవాడ, మే 2 : జిల్లాలోని మత్స్యకార గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఏపీ మత్స్యకార జేఏసీ జిల్లా అధ్యక్షుడు అర్జిల్లి అప్పలరాజు గురువారం బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను కోరారు. గురువారం అనకాపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఈ మేరకు సీఎం రమేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మత్స్యకార గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని పెదగంట్యాడ మండలం అప్పికొండ గ్రామానికి చెందిన మత్స్యకారులకు కల్యాణ మండపం ఏర్పాటు చేయాలని, శ్మశాన వాటికలో షెడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోవపాలెంలో ఘనంగా బంగారమ్మ జాతర

రాంబిల్లి, మే 2 : మండలంలోని లోవపాలెంలో గురువారం బంగారమ్మ జాతర ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలను సమర్పించారు. తమ మొక్కులను తీర్చుకున్నారు. నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజ నిర్వహించారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, మాజీ సర్పంచ్ ఎరుపల్లి చిట్టిబాబు, టీడీపీ నాయకుడు చెల్లూరి ఆనంద్ అమ్మవారిని దర్శించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని అమ్మవారిని వేడుకున్నారు.

పట్టపగలు వీధి లైట్ల వెలుగులు

ఎలమంచిలి, మే 2: మునిసిపాలిటీలో వీధిలైట్ల నిర్వహణ తీరు ఆది నుంచి అధ్వానంగా ఉన్నాయి. పట్టణంలో వీధిలైట్లు ఆరితే వెలగవు.. వెలిగితే ఆరవు అన్న చందంగా తయారైంది. ఈ విషయాన్ని పాలక వర్గ సభ్యులు సైతం కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తినా ఎటువంటి మార్పు కనబడడం లేదు. మునిసిపాలిటీలోని ధర్మవరం సమీపంలో పెంజెరువుకు వెళ్లే వీధిలైట్లు గురువారం పట్టపగలు వెలుగుతునే ఉన్నాయి. కొత్తపేట శివాలయం వీధిలో వీధిలైట్లలో కొన్ని వెలగకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీధిలైట్ల నిర్వహణ తీరుపై మునిసిపల్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ధర్మవరంలో పట్టపగలు వెలుగుతున్న వీధిలైటు

టీడీపీలో చేరిన యువకులు



రత్నాకర్ సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు

అనకాపల్లి టౌన్, మే 2 : తుమ్మపాల పంచాయతీ చినబాబుకాలనీకి చెందిన పలువురు యువకులు గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రత్నాకర్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు, మేనిఫెస్టోలోని ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కె. రవికుమార్ ఆధ్వర్యంలో యువకులు టీడీపీలోకి చేరడంతో అభినందించారు.

'కూటమి అభ్యర్థులను గెలిపించాలి'

పరవాడ, మే 2 : పెందుర్తి అసెంబ్లీ కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, బీజేపీ అనకాపల్లి ఎంపీ బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లను గెలిపించాలని కోరుతూ గురువారం రాత్రి పరవాడ బీసీ కాలనీలో కూటమీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గాజుగ్లాసు, కమలం గుర్తులపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, పైలా సన్యాసిరావు మాస్టారు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, పైలా చినఅక్కునాయుడు, పైలా బుజ్జి, కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం

కశింకోట, మే 2 : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధిలో 33కేవీ, మాకవరపాలెం 33/11కేవీ ఫీడర్ వర్కు కారణంగా కన్నూరుపాలెం సెక్షన్ కార్యాలయ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఉదయం 7 నుంచి 12 గంటల వరకు కన్నూరుపాలెం, చరకం, తీడ, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, భీమడోయనపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని చెప్పారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సబ్బవరం, మే 2 : మండలంలోని సబ్బవరం-2 సెక్షన్ పరిధిలోని అంతకాపల్లి సబ్ స్టేషన్, అంతకాపల్లి రూరల్ ఫీడర్ల ప్రి మాన్‌సూన్ కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రిటైర్డు ఆర్‌ఎస్‌ఐకు ఆత్మీయ వీడ్కోలు



సూరిబాబు దంపతులకు బహుమతిని అందిస్తున్న ఎస్పీమురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, మే 2: ఆర్‌ఎస్‌ఐగా పదవీ విరమణ పొందిన సూరిబాబుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై సూరిబాబును సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ సూరిబాబు పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేశారన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మై హోమ్‌లో శ్రీవారికి చక్రస్నానం



శ్రీవారికి చక్రస్నానం కోసం తీసుకువెళుతున్న అర్చకులు

ఎలమంచిలి, మే 2 : ములకలాపల్లి మై హోమ్ సిమెంటు పరిశ్రమ ఆవరణలో వ్యూహ లక్ష్మీసమేత శ్రీనివాస స్వామి వారి పుష్కర బ్రహ్మోత్సవంలో భాగంగా గురువారం స్వామి వారికి చక్రస్నానం, ఊంజల సేవ తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం యాగశాలలో నిత్యారాధనాదికం, పూర్ణహుతి, అష్టోత్తర శత(108)కలశాభిషేకం, చక్రస్నానం, సాయంత్రం ఊంజల సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం మై హోమ్ గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మై హోమ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) సీఎస్.పాండే, పరిశ్రమ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) వీహెచ్. చౌదరి, ఉద్యోగులు, కార్మికులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జోరుగా కూటమి నేతల ప్రచారం

సబ్బవరం, మే 2: సబ్బవరం మేజరు పంచాయితీలో సబ్బవరం, సాయినగర్, గొర్లివానిపాలెం, గంగిరెడ్ల కాలనీ, తదితర ప్రాంతాల్లో గురువారం కూటమి నేతలు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఓటర్లను కలసి మేనిఫెస్టోలోని హామీలు, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కూటమి ప్రభుత్వంతో భావితరాల భవిష్యత్తు బాగుంటుందని వివరిస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుకు గాజుగ్లాసు గుర్తుపైన, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రంలో ఎంపీటీసీ సభ్యుడు గొర్లి చైతన్య, గండి దేముడు, బలిరెడ్డి అప్పారావు, బర్ల రమణ, కొరాడ శ్రీను, లెక్కల అప్పలనాయుడు, అక్కుబాబు పాల్గొన్నారు.

అచ్యుతాపురానికి కేంద్ర బలగాలు

అచ్యుతాపురం, మే 2: ఎన్నికలు సజావుగా జరపడానికి కేంద్ర బలగాలు వచ్చాయని సీఐ బుచ్చిరాజు తెలిపారు. రాజస్థాన్‌కి చెందిన ఇండియన్ టిబెట్ బోర్డర్ పోలీసు సిబ్బంది బుధవారం రాత్రి అచ్యుతాపురం చేరుకున్నాయని ఆయన తెలిపారు. వీరందరికీ తాము ప్రత్యేకంగా ఆహ్వానించామన్నారు. వీరు ఎన్నికలు జరిగేంతవరకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటారన్నారు. వీరందరికీ పూడిమడక తుఫాన్ రక్షిత భవనంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

తుమ్మపాల, మే 2 : అనకాపల్లి మండలం మాకవరం గ్రామానికి చెందిన నీటి సంఘం అధ్యక్షుడు బాబుల దొర, అతని అనుచరులు గురువారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ కండువాలు వేసి టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, మెయ్య నూకరాజు, వసాది సుధీర్, నారపిన్ని చంద్రశేఖర్, చెల్లాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అనిత ఎన్నికల ప్రచారం



ఉప్పరాపల్లిలో ప్రచారం చేస్తున్న అనిత

ఎస్.రాయవరం, మే 2: టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని ఉప్పరాపల్లి, ఎస్.రాయవరం, వాకపాడు, వెంకటాపురం గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే అభ్యర్థిని అనిత, పార్టీ పరిశీలకుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రానున్నది కూటమి ప్రభుత్వమన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. తనకు సైకిల్ గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు గెలిపించాలని అనిత కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. రవిరాజు, టీడీపీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, తుంపాల నాగేశ్వరరావు, అల్లు నరసింహమూర్తి తదితర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి

పాయకరావుపేట: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను అన్నారు. గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పట్టణంలోని వెలమ కాలనీ, వీవర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో కూటమి పార్టీల తరపున పోటీచేయనున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, లెక్కల గోవిందు, మలిపెద్ది వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, సూరా సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ నాయకులు ఆచంట దొర, బీఎస్.నారాయణ, శివలంక నాగమల్లి, బీజేపీ నాయకులు కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

98వ వార్డులో పంచకర్ల ప్రచారం



గోపీజనవల్లభస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న పంచకర్ల రమేశ్‌బాబు

వేపగుంట, మే 2: జీవీఎంసీ 98 వార్డులో జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధి లోని సాయిమాధవనగర్, భరత్‌నగర్, శ్రీలక్ష్మీనరసింహనగర్ పరిసరాల్లో ఇంటింటికీ వెళ్లి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా గోపీజనవల్లభస్వామి ఆలయంలో ఆయన పూజలు చేశారు. అనంతరం సిద్ధిలక్ష్మీనగర్, భరత్‌నగర్ కాలనీవాసులతో ఆయన సమా వేశమై ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అలాగే 94వ వార్డు పరిధి ఆర్ఆర్‌వీ వెంకటాపురంలో పంచకర్ల రమేశ్‌బాబు సతీమణి మహాలక్ష్మి కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించి మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. రమేశ్‌బాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.నరసింహం, మామిడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కూటమితోనే సాధ్యం

సబ్బవరం, మే 2 : కూటమి ప్రభుత్వంతోనే బడుగు, బలహీన వర్గాల సంక్షేమం సాధ్యమని జనసేన నాయకుడు పంచకర్ల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదనాయుడుపాలెం రెడ్డి చెరువు, పెదనాయుడు చెరువుల్లో ఉపాధి కూలీలను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంతో అన్ని రంగాలు కుదేలయ్యాయన్నారు. కేంద్రం ఇస్తున్న అనేక పథకాలను జగన్ ప్రభుత్వం తమ పథకాలుగా చెప్పుకుంటుదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామన్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌కు గాజుగ్లాసు గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరనాయుడు, ఎం. మహాలక్ష్మీనాయుడు, కేవీ సత్యనారాయణ, పోతల కనకరాజు, గొంప నరసింగరావు, కర్రి కనకరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పూడిమడకలో వైసీపీ ఖాళీ

» టీడీపీలో చేరిన పూడిమడక-2 ఎంపీటీసీ సభ్యురాలు



పూడిమడకలో టీడీపీలో చేరిన వారితో ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, మే 2: జిల్లాలో అతిపెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడకలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. పూడిమడక-2 ఎంపీటీసీ సభ్యురాలు మేరుగు అరుణ, ఆయన భర్త మేరుగు అప్పలనాయుడు తన అనుచరులతో టీడీపీ సీనియర్ నాయకుడు మేరుగు బాపునాయుడు ఆధ్వర్యంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ సుమారు ఏడు వేల ఓటర్లున్న పూడిమడకలో తాము భారీ మెజారిటీ సాధిస్తామన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిపై కొంత అసంతృప్తి ఉండగా, స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు అవినీతి, నోటి దురుసుతనం వల్ల చాలా మంది తమ ఆత్మగౌరవం కాపాడుకోడానికి టీడీపీ, జనసేనల్లో చేరుతున్నారన్నారు. పూడిమడకలో ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు మత్స్యకారుల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది. ఈకార్యక్రమంలో పొన్నమళ్ల కొండబాబు, మేరుగు వెంకట్రావు, మేరుగు అచ్చియ్య కాసులబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు

అచ్యుతాపురం/రాంబిల్లి, మే 2 : వైసీపీకి రోజురోజుకు గట్టి షాక్‌లు తగులుతున్నాయి. వైసీపీ శ్రేణులు జనసేనలోకి చేరుతుండడంతో ఆ పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని వెంకటాపురంలో అధికార వైసీపీ సీనియర్ నాయకుడు రేఖా తాతారావు, అనుచరులు అయిన రేఖా వెంకటేష్, డి.రమణ, పి.గంగ అప్పారావు, ఉరుకుటి వెంకటరమణ, సీరా నూకరాజు, ఎస్.వెంకటరావు, డి.శివాజీ, ఉరుకూటి నానాజీ, ఎం.ప్రసాద్, కిల్లా మహేష్‌తో పాటు మరి కొంతమంది గురువారం అచ్యుతాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వీరికి విజయకుమార్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అచ్యుపురం జనసేన మండల అధ్యక్షులు బైలపూడి రామదాసు, జనసేన నియోజకవర్గ యువ నాయకుడు డీఎస్‌ఎన్‌రాజు, రోమాల రమణ పాల్గొన్నారు.

పెదకలవలాపల్లి రైతులను ఆదుకోండి

రాంబిల్లి, మే 2: పెదకలవలాపల్లి రైతుల సమస్యను అధికారులు పరిష్కరించాలని సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు అన్నారు. గురువారం రైతుల నిరసన కార్యక్రమానికి ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ.. గ్రామం చుట్టూ డీఆర్‌డీవో అధికారులు ప్రహరీ నిర్మిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. రైతులు తమ పొలాలకు ఎలా వెళ్లాలో అధికారులు తేల్చాలని, అనంతరం ప్రహరీ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వం, అధికారులు కనీసం స్పందించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రావి దేముళ్లు, సీపీఎం నాయకుడు ఎరిపల్లి రాము, రైతులు పాల్గొన్నారు.

వైసీపీని బంగాళాఖాతంలో కలపాలి

... 5వ పేజీ తరువాయి

అటువంటిది తేలేమన్నారు. వైసీపీ నాయకులు సర్క్యూట్ హౌస్, దసపల్లా భూములు, క్రిస్టియన్ భూములు లాక్కున్నారని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత వారు కాజేసిన భూములపై ప్రత్యేక కమిషన్ వేసి విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు. గూండాల బెదిరింపులకు భయపడి డబ్బున్నవారు విదేశాలకు వెళ్లిపోతున్నారని, విశాఖలో ఎవరూ అలా వెళ్లాల్సిన అవసరం లేదని, నిలబడి పోరాడాలని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. విశాఖ ప్రజల గుండెలకు నిప్పు అంటించి ధైర్యం నింపడానికే వచ్చానన్నారు. స్టీల్‌ప్లాంటు కోసం 32 మంది ప్రాణత్యాగం చేశారని, అలా పోరాటం చేస్తేనే ఏదైనా దక్కుతుందన్నారు. మార్పు కోసం ముందుకురావాలని, ప్రతి ఒక్కరూ ఓట్లు వేయాలని కోరారు. విశాఖలో వైసీపీ నాయకులు ఇస్లాం బ్యాంక్ ఏర్పాటు చేస్తామని చేయలేదని, రంజాన్ తోఫా రద్దు చేశారని, షాదీ తోఫా లక్ష రూపాయిలు ఇస్తామని ఇవ్వలేదని, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పంపిణీ చేయలేదని, ఉర్దూ భాషను ప్రోత్సహించలేదని విమర్శించారు. ముస్లింలకు పెన్షన్లు, ఇంటి స్థలాలు ఇస్తామని, రూ.5 లక్షల వడ్డీ లేని రుణం ఇస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. మత్స్యకారులకు ఉపయోగపడని జీఓ నంబరు 217 రద్దు చేస్తామని, వారికి ఏడాదికి రూ.20 వేలు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన ప్రాంతాల్లో జెట్టీలు నిర్మిస్తామన్నారు. ఈ సభలో టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, తూర్పు అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తరం అభ్యర్థి విష్ణుకుమార్ రాజు, గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పెతంకశెట్టి గణబాబు ప్రసంగించారు.

అవ్వాతాతలను ఏడిపించేన్!

... 5వ పేజీ తరువాయి

వెనుదిరిగారు. నర్సీపట్నంలో బ్యాంకుల్లో జమ చేసిన పింఛను డబ్బులు తీసుకోవడానికి గురువారం మండుటెండలో అవ్వా తాతలు కుటుంబ సభ్యులను తోడు తీసుకొని వచ్చారు. అక్కడ గంటల తరబడి క్యూలో నిలబడ వలసి వచ్చింది. కొంత మంది ఆధార్ కార్డు మాత్రమే వెంట తెచ్చుకొని, బ్యాంకు ఖాతా పుస్తకాలు తీసుకు రాక పోవడంతో వెనుతిరగాల్సి వచ్చింది. ఈకేవైసీ సమస్య కారణంగా డబ్బులు డ్రా చేయడం వృద్ధులు చాలా కష్టమైంది. ప్రభుత్వం పింఛను డబ్బులు నేరుగా ఇంటికి పంపించి ఉంటే ఈ సమస్య వచ్చి ఉండేది కాదని పలువురు లబ్ధిదారులు వాపోయారు. పాయకరావుపేటలోని అన్ని బ్యాంకుల్లో పింఛనుదారులు బారులుతీరి కనిపించారు. మండుటెండలో దూర ప్రాంతాల నుంచి బస్సుల్లో, ఆటోల్లో బ్యాంకులకు వచ్చారు. గంటల తరబడి బ్యాంకుల వద్ద బారులుతీరారు. కొందరి ఖాతాలు మనుగడలో లేకపోవడం, మరికొందరికి కేవైసీ కాకపోవడంతో బ్యాంకు సిబ్బంది నగదు చెల్లించలేదు. ముందు ఖాతాను యాక్టివ్ చేసుకుని మర్నాడు డబ్బులు డ్రా చేసుకోవాలని చెప్పడంతో నిరాశ చెందారు. బ్యాంకుల చుట్టూ తమను తిప్పడం దారుణమని పలువురు వాపోయారు. వైసీపీ ప్రభుత్వం కావాలనే తమను ఇబ్బందులకు గురిచేస్తోందని, గత నెలలో మాదిరిగా సచివాలయాల వద్దే పింఛన్ ఇచ్చినా బాగుండేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

అమ్మవారి మాన్యం హాంఫట్

... 5వ పేజీ తరువాయి

ఉందని ఈ మేరకు తమ దస్తావేజుల్లో ఉందని తెలిపారు. అటువంటి భూమి ఎలా ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ అయిందో అర్థం కావడంలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పైడితల్లమ్మ మాన్యానికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నా రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తూ వచ్చారని, గతంలో కలెక్టర్‌కి గ్రామస్థులతో కలిసి ఫిర్యాదు చేశామని చెప్పారు. వెంటనే స్పందించి స్థానిక సర్వేయర్‌తో సర్వే చేయించారని, ఈ భూమి పైడితల్లి అమ్మవారికి చెందినదేనని సర్వేయర్ నివేదిక కూడా ఇచ్చారని తెలిపారు. అయినా అమ్మవారి పేరున పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వడానికి స్థానిక రెవెన్యూ అధికారులు అంగీకరించలేదన్నారు. దీని వెనుక ప్రముఖ రాజకీయ నాయకులు ఉండడంతో పాటు మంత్రుల పేషీల నుంచి ఫోన్లు వస్తుండడంతో అధికారులు పాసు పుస్తకం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు అమ్మవారి మాన్యంలో ఉన్న జీడి చెట్లను తొలగించి చదునుచేసి ప్లాట్లు వేసేశారని చెప్పారు. రియల్టర్‌ని అడిగితే పక్కా రిజిస్ట్రేషన్ అయిందని చెబుతున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ధర్మకర్త వంశంలో కొందరితో పాటు కౌలుదారులు ఏకమై అతి తక్కువ ధరకు విక్రయించేశారని తెలిసిందని, దీనిపై ధర్మపోరాటం చేస్తానని ఆదినారాయణ చెప్పారు.

ఉద్యోగులు అష్టకష్టాలు

... 5వ పేజీ తరువాయి

చేసిన మొత్తంలో సగం ఇచ్చినా చాలా అవసరాలు తీరేవని, చెల్లింపులపై ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని ఓ సీనియర్ అసిస్టెంట్ వాపోయారు. ఇక, సరండర్ లీవ్‌ల సంగతి సరేసరి. ఏడాదికి ఒక్కో ఉద్యోగి 30 సరెండర్ లీవ్‌లు వస్తాయి. వీటిలో 15 వరకు ఎన్‌క్యాష్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్యశాఖలో సుమారు వెయ్యి మంది ఉద్యోగులు మూడేళ్లుగా సరండర్ లీవ్ ఎన్‌క్యాష్ చేసుకునేందుకు దరఖాస్తు చేశారు. కానీ ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కూ దిక్కులేదు

ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అయితే ప్రభుత్వం మొత్తంలో బెనిఫిట్స్ అందించాలి. నిధుల లేమి కారణంగా ఉద్యోగ విరమణ వయసును ప్రభుత్వం పెంచేసింది. దీంతో రెండేళ్లుగా అనేక శాఖల్లో పదవీ విరమణలు లేవు. కానీ ఈ ఏడాది జనవరి నుంచి పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగుల సంఖ్య పెరిగింది. వీరంతా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కు దరఖాస్తు చేయడం మినహా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. సకాలంలో నెలవారీ జీతాలు చెల్లించక, దాచుకున్న డబ్బును తిరిగివ్వక, ఉద్యోగ విరమణ చేసినా బెనిఫిట్స్ గురించి పట్టించుకోకుండా ఉద్యోగులను ప్రభుత్వం అన్నిరకాలుగా వేధింపులకు గురిచేస్తోందని వారంతా వాపోతున్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

మరిడమ్మ ఆలయ హుండీల లెక్కింపు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నర్సీపట్నం, మే 2 : పట్టణంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా ఎనిమిది రోజులకు రూ.3,03,556ల ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి గంగారావు తెలిపారు. గురువారం ఆలయంలోని రెండు హుండీలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఓటర్లకు స్లిప్పులు పంపిణీ

గొలుగొండ, మే 2 : మండలంలోని గ్రామ గ్రామాన ఓటర్లకు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. మొత్తం 52 పోలింగ్ కేంద్రాల్లో 40,504 మంది ఓటర్లకు ఎన్నికల కమిషన్ స్లిప్పులను అందిస్తున్నట్టు తహసీల్దార్ భాస్కరరాజు తెలిపారు. ఓటర్లు ఆయా స్లిప్పులను భద్రపర్చుకుని ఓటుహక్కును వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

అమ్మవారి మాన్యం హాంఫట్

... 5వ పేజీ తరువాయి

ఉందని ఈ మేరకు తమ దస్తావేజుల్లో ఉందని తెలిపారు. అటువంటి భూమి ఎలా ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ అయిందో అర్థం కావడంలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పైడితల్లమ్మ మాన్యానికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నా రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తూ వచ్చారని, గతంలో కలెక్టర్‌కి గ్రామస్థులతో కలిసి ఫిర్యాదు చేశామని చెప్పారు. వెంటనే స్పందించి స్థానిక సర్వేయర్‌తో సర్వే చేయించారని, ఈ భూమి పైడితల్లి అమ్మవారికి చెందినదేనని సర్వేయర్ నివేదిక కూడా ఇచ్చారని తెలిపారు. అయినా అమ్మవారి పేరున పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వడానికి స్థానిక రెవెన్యూ అధికారులు అంగీకరించలేదన్నారు. దీనివెనుక ప్రముఖ రాజకీయ నాయకులు ఉండడంతో పాటు మంత్రుల పేషీల నుంచి ఫోన్లు వస్తుండడంతో అధికారులు పాసు పుస్తకం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు అమ్మవారి మాన్యంలో ఉన్న జీడిచెట్లను తొలగించి చదునుచేసి ప్లాట్లు వేసేశారని చెప్పారు. రియల్టర్‌ని అడిగితే పక్కా రిజిస్ట్రేషన్ అయిందని చెబుతున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ధర్మకర్త వంశంలో కొందరితో పాటు కౌలుదారులు ఏకమై అతి తక్కువ ధరకు విక్రయించేశారని తెలిసిందని, దీనిపై ధర్మపోరాటం చేస్తానని చెప్పారు

నర్సీపట్నంలో మహిళా ఓటర్లే కీలకం

- నియోజకవర్గంలో వీరే అధికం
- మొత్తం ఓటర్లు 2,12,046 మంది
- ఇందులో పురుషులు 1,02,747.., స్త్రీలు 1,09,295 మంది
- పురుషుల కంటే 6,548 మంది మహిళా ఓటర్లు ఎక్కువ
- యువ మహిళా ఓటర్లు 52,338 మంది

నర్సీపట్నం, మే 2 : నర్సీపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయానికి మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. ఏప్రిల్ 15, 2024 ఓటరు జాబితా ప్రకారం నియోజవర్గంలో 2,12,046 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,02,747 మందికాగా, మహిళా ఓటర్లు 1,09,295, ఇతరులు నలుగురు ఉన్నారు. పురుషుల కంటే 6,548 మంది మహిళా ఓటర్లు అంటే మూడు శాతం అధికం. ఈ నియోజకవర్గంలో మహిళలు ఏ పార్టీకి మద్దతు తెలిపితే ఆ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారు. 18నుంచి 39ఏళ్ల లోపు యువ మహిళా ఓటర్లు 52,638 మంది ఉన్నారు. అదే విధంగా 40నుంచి 49 ఏళ్ల లోపు 22,161 మంది, 50 నుంచి 59ఏళ్ల మధ్య మహిళా ఓటర్లు 17,286 మంది ఉన్నారు.



వృద్ధ మహిళలు 60 నుంచి 69 ఏళ్ల మధ్య 11,048, 70 నుంచి 79 ఏళ్ల 4,943, 80 నుంచి 89 ఏళ్ల మధ్య 1,121 మంది, 90 నుంచి 99 ఏళ్ల వయస్సులో 98మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువ మహిళా ఓటర్లు 24.8 శాతం ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్లు

గొలుగొండ మండలంలో మొత్తం ఓటర్లు 41,397 మంది కాగా, పురుష ఓటర్లు 20,168 మంది, మహిళా ఓటర్లు 21,229., నాతవరం మండలంలో మొత్తం ఓటర్లు 51,478 మంది కాగా, పురుష ఓటర్లు పురుష ఓటర్లు 25,216, మహిళా ఓటర్లు 26,262 మంది. నర్సీపట్నంలో మొత్తం 72,765మంది కాగా, పురుష ఓటర్లు 34,764 మంది, మహిళా ఓట్లు 37,997మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. అదేవిధంగా మాకవరపాలెం మండలంలో మొత్తం ఓటర్లు 46,406మంది కాగా, పురుష ఓటర్లు 22,599 మంది, మహిళా ఓటర్లు 23,807 మందిగా తాజా ఓటర్ల జాబితాలో పేర్కొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

- టీడీపీ మ్యానిఫెస్టో అద్భుతమని జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ కితాబు



ధర్మసాగరంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రమణమ్మ

నర్సీపట్నం అర్బన్, మే 2 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ విడుదల చేసిన మ్యానిఫెస్టో అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేలా ఉందని నర్సీపట్నం జడ్పీటీసీ సుకల రమణమ్మ అన్నారు. ఈ మేరకు మ్యానిఫెస్టోను రూపకల్పన చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చిత్రపటానికి ధర్మసాగరంలో గురువారం ఆమె క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. అధికారంలోకి రాగానే టీడీపీ ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలు పేద, మధ్య తరగతి కష్టాలను దూరం చేస్తాయన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగంపేటలో పలువురు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో అయ్యన్న సతీమణి పద్మావతి

కృష్ణాదేవిపేట, మే 2 : గొలుగొండ మండలం లింగంపేటలో గురువారం వైసీపీ నుంచి పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి అభ్య ర్థుల విజయమే లక్ష్యంగా అంతా పనిచేయాలని ఆమె కోరారు పార్టీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, టీఎస్ఎన్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గోలకొండ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ డబ్బుల కోసం వృద్ధుల పాట్లు

- బ్యాంకులు, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని పలువురు ఆవేదన

నాతవరం, మే 2 : పింఛన్ డబ్బుల కోసం మండలంలోని పలువురు వృద్ధులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించి గురువారం మండుటెండలో పలువురు బ్యాంకుల చుట్టూ, గ్రామ సచివాలయాల చుట్టు ప్రదక్షిణలు చేయడం కనిపించింది. బ్యాంకుల వద్ద క్యూలో నిల్చొని డబ్బుల కోసం కౌంటర్ వద్దకు వెళ్లగా ఇంకా డబ్బులు పడలేదని సిబ్బంది సమాధానం చెప్పడంతో వారు అవాక్కయ్యారు. దీంతో అటువంటి వారు సచివాలయాల వద్దకు పరుగు తీశారు. సుమారు పదిహేను కిలోమీటర్లు దూరంలో ఉన్న సరుగుడు తదితర ప్రాంతాల నుంచి వృద్ధులు నాతవరం బ్యాంకుకు వచ్చి ఈ రకమైన సమస్యను ఎదుర్కోవడం కనిపించింది. ఈ సందర్భంగా నాతవరానికి చెందిన చిత్రాడ వరలక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ ఏప్రిల్ నెల పింఛన్ డబ్బుల కోసం నాతవరం గ్రామీణ బ్యాంకు వద్దకు వెళితే సచివాలయం దగ్గరకు వెళ్లమన్నారని తెలిపింది. సచివాలయం వద్దకు ఎండలో వెళితే మూడు రోజులు ఆగితే పింఛన్ డబ్బులు వస్తాయని చెప్పి పంపేశారని వాపోయింది. అలాగే, నాతవరానికి చెందిన ఇంజరపు లక్ష్మి అనే వితంతువు మాట్లాడుతూ పింఛన్ డబ్బుల కోసం ఎండలో నాతవరం గ్రామీణ బ్యాంకుకు వెళితే ఇంకా అకౌంట్‌లో డబ్బులు పడలేదని తెలిపారని, రెండు రోజుల తరువాత రమ్మన్నారని వాపోయింది. ఎండలో ఇలా తమను తిప్పడం సరికాదని పేర్కొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు ఇటువంటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాల్సిందిగా వేడుకుంది.

గన్నవరం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

నాతవరం, మే 2 : జిల్లా సరిహద్దులోని గన్నవరం మెట్ట వద్ద ఎంసీసీ నోడల్ అధికారి జె.రాంబాబు గురువారం వాహన తనిఖీలను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమంగా తరలించకుండా నిఘా మరింత పటిష్టం చేయాలని సూచించారు. అనంతరం గన్నవరం సచివాలయాన్ని సందర్శించారు. ఎంబీపట్నంలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఓటు వేసేందుకు వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అక్కడి సిబ్బందికి ఆదేశించిన అనంతరం పలు సూచనలు చేశారు.

అవ్వాతాతలను ఏడిపింఛెన్!

... 5వ పేజీ తరువాయి

వెనుదిరిగారు. నర్సీపట్నంలో బ్యాంకుల్లో జమ చేసిన పింఛను డబ్బులు తీసుకోవడానికి గురువారం మండుటెండలో అవ్వా తాతలు కుటుంబ సభ్యులను తోడు తీసుకొని వచ్చారు. అక్కడ గంటల తరబడి క్యూలో నిలబడవలసి వచ్చింది. కొంత మంది ఆధార్ కార్డు మాత్రమే వెంట తెచ్చుకొని, బ్యాంకు ఖాతా పుస్తకాలు తీసుకు రాక పోవడంతో వెనుతిరగాల్సి వచ్చింది. ఈకేవైసీ సమస్య కారణంగా డబ్బులు డ్రా చేయడం వృద్ధులు చాలా కష్టమైంది. ప్రభుత్వం పింఛను డబ్బులు నేరుగా ఇంటికి పంపించి ఉంటే ఈ సమస్య వచ్చి ఉండేది కాదని పలువురు లబ్ధిదారులు వాపోయారు. పాయకరావుపేటలోని అన్ని బ్యాంకుల్లో పింఛనుదారులు బారులుతీరి కనిపించారు. మండుటెండలో దూర ప్రాంతాల నుంచి బస్సుల్లో, ఆటోల్లో బ్యాంకులకు వచ్చారు. గంటల తరబడి బ్యాంకుల వద్ద బారులుతీరారు. కొందరి ఖాతాలు మనుగడలో లేకపోవడం, మరికొందరికి కేవైసీ కాకపోవడంతో బ్యాంకు సిబ్బంది నగదు చెల్లించలేదు. ముందు ఖాతాను యాక్టివ్ చేసుకుని మర్నాడు డబ్బులు డ్రా చేసుకోవాలని చెప్పడంతో నిరాశ చెందారు. బ్యాంకుల చుట్టూ తమను తిప్పడం దారుణమని పలువురు వాపోయారు. వైసీపీ ప్రభుత్వం కావాలనే తమను ఇబ్బందులకు గురిచేస్తోందని, గత నెలలో మాదిరిగా సచివాలయాల వద్దే పింఛన్ ఇచ్చినా బాగుండేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీని బంగాళాఖాతంలో కలపాలి

... 5వ పేజీ తరువాయి

అటువంటిది తేలేమన్నారు. వైసీపీ నాయకులు సర్క్యూట్ హౌస్, దసపల్లా భూములు, క్రిస్టియన్ భూములు లాక్కున్నారని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత వారు కాజేసిన భూములపై ప్రత్యేక కమిషన్ వేసి విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు. గూండాల బెదిరింపులకు భయపడి డబ్బున్నవారు విదేశాలకు వెళ్లిపోతున్నారని, విశాఖలో ఎవరూ అలా వెళ్లాల్సిన అవసరం లేదని, నిలబడి పోరాడాలని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. విశాఖ ప్రజల గుండెలకు నిప్పు అంటించి ధైర్యం నింపడానికే వచ్చానన్నారు. స్టీల్‌ప్లాంటు కోసం 32 మంది ప్రాణత్యాగం చేశారని, అలా పోరాటం చేస్తేనే ఏదైనా దక్కుతుందన్నారు. మార్పు కోసం ముందుకురావాలని, ప్రతి ఒక్కరూ ఓట్లు వేయాలని కోరారు. విశాఖలో వైసీపీ నాయకులు ఇస్లాం బ్యాంక్ ఏర్పాటు చేస్తామని చేయలేదని, రంజాన్ తోఫా రద్దు చేశారని, షాదీ తోఫా లక్ష రూపాయిలు ఇస్తామని ఇవ్వలేదని, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పంపిణీ చేయలేదని, ఉర్దూ భాషను ప్రోత్సహించలేదని విమర్శించారు. ముస్లింలకు పెన్షన్లు, ఇంటి స్థలాలు ఇస్తామని, రూ.5 లక్షల వడ్డీ లేని రుణం ఇస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. మత్స్యకారులకు ఉపయోగపడని జీఓ నంబరు 217 రద్దు చేస్తామని, వారికి ఏడాదికి రూ.20 వేలు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన ప్రాంతాల్లో జెట్టీలు నిర్మిస్తామన్నారు. ఈ సభలో టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, తూర్పు అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తరం అభ్యర్థి విష్ణుకుమార్ రాజు, గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పెతంకశెట్టి గణబాబు ప్రసంగించారు.

చోడవరం
నియోజకవర్గం

విభజన హామీలపై నిలదీయండి

- ఏపీ ఆర్‌సిఎస్ నేత వీరాంజనేయులు



బుచ్చెయ్యపేటలో మాట్లాడుతున్న రామాంజనేయులు

బుచ్చెయ్యపేట, మే 2: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. జనచైతన్యరథం బృందం గురువారం బుచ్చెయ్యపేటలో పర్యటించింది. అరుణోదయ సంస్కృతి సమాఖ్య (ఏసీఎఫ్) కళాకారులు ఆటపాటలతో, వ్యక్తలు ప్రసంగాలతో ప్రజలను చైతన్యం కలిగించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ, 2014, 2019లో ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధన నినాదంతో గద్దెనెక్కిన చంద్రబాబు, జగన్ కేసులకు భయపడి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో దళిత, ఆదివాసి, మహిళల, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. నిరుద్యోగం యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. ప్రజలను చైతన్యపరిచేందుకు ఏప్రిల్ 14న నెల్లూరు జిల్లాలో ప్రారంభించామన్నారు. ఈ బృందంలో ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి), అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (విజృంభణ) తదితర సంఘాల నాయకు లు పాల్గొన్నారు.

ఎండల్లో పండుటాకుల విలవిల

- బ్యాంకుల వద్ద పింఛన్లకోసం వృద్ధుల దుస్థితి .. ప్రభుత్వ తీరుతో అగచాట్లు

మాడుగుల రూరల్, మే 2: జగన్ ప్రభుత్వం పగబట్టిన విధంగా పింఛన్‌దారులతో ఆడుకుంటోంది. వృద్ధులు, వికలాంగులనే కనికరంలేకుండా పింఛన్ల కోసం తిప్పుతోంది. గత నెలలో సచివాలయాలకు తిప్పిన ప్రభుత్వం. ఈసారి బ్యాంక్‌లకు సూచించింది. ఫలితంగా వృద్ధులు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో సామాజిక పింఛన్‌దారులతో బ్యాంకులు కిటలాడుతున్నాయి. ప్రభుత్వం పింఛన్ సొమ్ము ఖాతాల్లో జమచేయడంతో లబ్ధిదారులు బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. బుధవారం మేడే బ్యాంకులకు సెలవు. గురువారం స్థానికంగా ఉన్న ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఏపీజీవీబీ బ్యాంకులు ఖాతాదారులు, పింఛనుదారులతో రద్దీగా నెలకొంది. బ్యాంకుల్లో నగదు త గినంత అందుబాటులో ఉన్నా పింఛనుదారులు లావాదేవీలు జరపకపోవడంతో పలువురు ఖాతాలు నిలిచిపోయాయి. అ లాగే, ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాక, వేలిముద్రలు పడక తదితర కారణాల వల్ల పింఛనుదారులు ఇబ్బందులు పడుతున్నారు. పింఛనుదారుల బ్యాంకు ఖాతా వివరాలు కూడా గ్రామసచివాలయాల అధికారులకు సరైన సమాచారం ఉండడం లేదు. బ్యాంకులకు వచ్చిన పింఛనుదారులు తమ ఖాతాలు ఆపరేట్ అవుతున్నాయా? లేవా అనే విషయాలు వారికి తెలియక సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక వేళ వాటిని సరిచేయాలంటే సంబంధిత బ్యాంక్‌కు దరఖాస్తు సమర్పించాల్సి వస్తున్నది. దీంతో మరో రెండు మూడు రోజులు సమయం పట్టే పరిస్థితి కనిపిస్తున్నది. అలాగే, బ్యాంకు ఖాతాల్లో పింఛనుసొమ్ము జమ చేయడంతో వృద్ధులు వ్యయ ప్రయాసలకు గురి కావాల్సి వస్తున్నది. బ్యాంక్‌లోపల స్థల సమస్యతోపాటు ఎండ తీవ్రతకు విలవిల్లాడుతున్నారు. లోన ఉండలేక బయటకు వచ్చి కొంత మంది మహిళలు నేలపైనే కూర్చుండిపోవడం కనిపించింది. చంటి బిడ్డల తల్లులు కూడా బ్యాంకు పని మీద వచ్చి ఇబ్బందులు పడ్డారు.

ఖాతాలు వినియోగం లేక.. ఇబ్బందులు

రోలుగుంట : పింఛన్ల పంపిణీ కోసం లబ్ధిదారులు మండుటెండలో బ్యాంకుల చుట్టూ తిరుగుతూ పడిగాపులు కాస్తున్నారు. వృద్ధులు బ్యాంకులు, బ్యాంకు పాయింట్ కేంద్రాల బాట పట్టారు. దీంతో మండలంలోని 24 పంచాయతీల పరిధిలో 16 గ్రామ సచివాలయాల పరిధిలో పింఛన్‌దారులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం ఏపీజీవీబీ బ్యాంకు పరిధిలో 10 గ్రామాలు ఉన్నాయి. మిగతా గ్రామ పంచాయతీల ప్రజలు నర్సీపట్నం, కొత్తకోటలో ఉన్న బ్యాంకుల పరిధిలో ఖాతాదారులుగా ఉన్నారు. పలు గ్రామాల్లో బ్యాంకు పాయింట్లు ఉన్నాయి. అలాగే అధిక సంఖ్యల ఖాతాదారులు ఖాతాలు ఉన్నా వియోగంలో లేక ఇన్‌యాక్టివ్ అయ్యి ఉన్నాయి. దీంతో పునరుద్ధరించుకోవడానికి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అలాగే కొంత మంది ఖాతాల్లో ఇంకా సొమ్ము జమకాలేదు. మైనస్ బ్యాలెన్సు ఉన్నవారికి పింఛన్ సొమ్ము ఛార్జీల రూపంలో కట్ అవుతున్నాయి.



రోలుగుంటలో బ్యాంకు పాయింట్ వద్ద అవస్థలు పడుతున్న వృద్ధులు

కాళ్లరిగేలా తిరుగుతున్నా..



రెండు రోజులుగాపింఛన్‌సొమ్ము కోసం కాళ్ల అరిగేలా తిరుగుతున్నాను. సచివాలయానికి వెళితే.. అక బ్యాంకుకు వచ్చా. అయితే, అకౌంట్ వినియోగించక ఆగిపోయిందని చెబుతున్నారు. పునరుద్ధరణకు పాట్లుపడుతున్నాం.

- పారుపల్లి యర్రయ్యమ్మ, పింఛన్‌దారు, రోలుగుంట

కిలో మీటర్ల మేర నడక

బుచ్చెయ్యపేట: పింఛన్ సొమ్ముకోసం లబ్ధిదారులు మండుటెండలో కిలోమీటర్ల దూరాన ఉన్న బ్యాంకుల వద్దకు వచ్చి అవస్థలు పడ్డారు. బుధవారం బ్యాంకులు సెలవు కావడంతో నిరాశతో వెనుదిరిగిన వివిధ పింఛన్ లబ్ధిదారులు, గురువారం బ్యాంకులకు పోటెత్తారు. వడ్డాది, విజయరామరాజుపేట, బుచ్చెయ్యపేట, రాజాం, సీతయ్యపేట వాణిజ్య బ్యాంకులు పింఛన్ లబ్ధిదారులత కిటకిటలాడాయి. నగదు విత్ డ్రాకు గంటల కొద్దీ సమయం పట్టడంతో అవస్థలు ఎదుర్కొన్నారు.

ఎన్నెన్ని కష్టాలో..

దేవరాపల్లి: స్థానిక బ్యాంకులు, పీసీ పాయింట్ల వద్ద బారులు తీరారు. మండలంలో మొత్తం 10,500 మంది పెన్షన్‌దారులున్నాయి. వీరిలో మంచంపై ఉన్నవారు, వికలాంగులు 2, 500 మంది ఉన్నారు. ఇలాంటి వారికి నేరుగా వెల్ఫేర్ అసిస్టెంట్ గ్రామాల్లోనే ఇచ్చారు. బ్యాంకు ఖాతాల్లో 8వేల మందికి వేశారు. ఇందులో నలభై శాతం మంది మాత్రమే మనుగడలో ఖాతాలు ఉండడం లావాదేవీలు నిలిచి పోయాయి. చాలా మందికి ఆధార్, బ్యాంకు ఖాతాలకు అనుసంధానం కాలేదు. సచివాలయ సిబ్బంది ఇవేమి చూడకుండా పింఛన్ సొమ్ము ఖాతాలకు జమచేశారు.. రూ.10 వేల లోపు లావాదేవీలు పీసీ పాయింట్లలో తీసుకోవాలి. దీని వలన ఎప్పటి నుంచో ఖాతాలు మనుగడ లేక పోవడంతో సమస్య ఎదుర్కొన్నారు. నిరీక్షించిన తర్వాత బ్యాంకుకు వెళ్లాలని చెప్పడంతో ఎండలో నానా ఇబ్బందులు పడ్డారు. సుదూర ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాలు వారు మండల కేంద్రానికి రావాల్సి వచ్చింది. దేవరాపల్లి సమీపంలో ఉన్న అనంతగిరి మండలం గిరిజనులు (పెన్షన్‌దారులు) దేవరాపల్లి బ్యాంకులకు ఆటోల్లో వచ్చారు. ఖాతాలను పునరుద్ధరణకు చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు పడ్డారు.

మాడుగుల
నియోజకవర్గం

మోదకొండమ్మను దర్శించుకున్న సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి



మెమొంటోతో సత్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్అప్పలరాజు

మాడుగుల, మే 2: మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి గురువారం దర్శించుకున్నారు. మండల కేంద్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించిన అనంతరం ఆమె మోదకొండమ్మని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆమెకు మెమొంటో అందించి సత్కరించారు.

ఎండలు బాబోయ్..

చోడవరం, మే 2: వేసవి ఎండలు ఠారెత్తిస్తున్నాయి. దీనితో జనం రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు. గురువారం మధ్యాహ్నం ఎండ భీకరంగా కాసింది. దీంతో ప్రధాన రహదారిపై జనసంచారం తగ్గిపోయింది. చాలామంది ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ఎండతోపాటు, ఉక్కబోతతో జనం అల్లాడుతున్నారు. రాత్రి సమయంలో సైతం వాతావరణం చల్లబడక స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

మాడుగుల: ఎండలు అధికం కావడడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోవడంతో తల్లడిల్లిపోతున్నారు. ఉదయం పది గంటలకే ఎండ సుర్రుమంటోంది. మధ్యాహ్నం పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే హడలి పోతున్నారు. జన సంచారం లేకపోవడంతో వీధులు, రోడ్డు నిర్మానుష్యమవుతున్నాయి. మరో వైపు ఉక్కపోతతో నానా అవస్థలు పడుతున్నారు.

రావికమతం: ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ వేడి గాలుల ధాటికి కంటి మీద కునుకు పట్టక గర్భిణులు, పిల్లలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం. గత వారం రోజులుగా రావికమతంలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

ఉద్యోగులు అష్టకష్టాలు

... 5వ పేజీ తరువాయి

చేసిన మొత్తంలో సగం ఇచ్చినా చాలా అవసరాలు తీరేవని, చెల్లింపులపై ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని ఓ సీనియర్ అసిస్టెంట్ వాపోయారు. ఇక, సరండర్ లీవ్‌ల సంగతి సరేసరి. ఏడాదికి ఒక్కో ఉద్యోగి 30 సరెండర్ లీవ్‌లు వస్తాయి. వీటిలో 15 వరకు ఎన్‌క్యాష్ చేసుకునే అవ కాశం ఉంటుంది. ఆరోగ్యశాఖలో సుమారు వెయ్యి మంది ఉద్యోగులు మూడేళ్లుగా సరండర్ లీవ్ ఎన్‌క్యాష్ చేసుకునేందుకు దరఖాస్తు చేశారు. కానీ ఒక్కరూపాయి విడుదల కాలేదు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కూ దిక్కులేదు

ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అయితే ప్రభుత్వం మొత్తంలో బెనిఫిట్స్ అందించాలి. నిధుల లేమి కారణంగా ఉద్యోగ విరమణ వయసును ప్రభు త్వం పెంచేసింది. దీంతో రెండేళ్లుగా అనేక శాఖల్లో పదవీ విరమణలు లేవు. కానీ ఈ ఏడాది జనవరి నుంచి పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగుల సంఖ్య పెరిగింది. వీరంతా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కు దరఖాస్తు చేయడం మినహా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. సకాలంలో నెలవారీ జీతాలు చెల్లించక, దాచుకున్న డబ్బును కూడా తిరిగివ్వక, ఉద్యోగ విరమణ చేసినా బెనిఫిట్స్ గురించి పట్టించుకోకుండా ఉద్యోగులను ప్రభుత్వం అన్నిరకాలుగా వేధింపులకు గురిచేస్తోందని వారంతా వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మహిళా సంక్షేమం

- అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

బుచ్చెయ్యపేట, మే 2: తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల కూటమి ప్రభుత్వంతోనే మహిళా సంక్షేమం సాధ్యపడుతుందని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. ఆయన గురువారం రాజాం, ఆర్.భీమవరంలో పర్యటించారు. ఉపాధి కూలీల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కూటమి మేనిఫెస్టోలో మహిళా సంక్షేమానికే పెద్దపీట వేశామన్నారు. సీఎం జగన్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన మద్యం నిషేధిస్తానన్న హామీని అమలు చేయకుండా మహిళలను మోసం చేశారని విమర్శించారు. రూ.6 వేల కోట్ల మద్యం ఆదాయాన్ని కాస్తా, జగన్ తన ఐదేళ్ల పాలనలో రూ. 24వేల కోట్లకు పెంచి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీలు పెంచనని తొమ్మిది సార్లు పెంచిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆర్టీసీ బస్సు చార్జీలు మూడుసార్లు పెంచేశారని, నిత్యావసర సరకుల ధరలు అమాంతంగా పెంచేసి ప్రజల నడ్డి విరిచారన్నారు. సంక్షేమం పేరుతో వైసీపీ ప్రభుత్వం కుడిచేత్తే ఇచ్చి, పన్నుల పేరుతో ఎడమచేత్తో లాక్కుందని ఆరోపించారు. స్థానిక సంస్థలకు నెల రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ. 998.84 కోట్లు నిధులు పంచాయతీ ఖాతాలకు జమచేయక పోవడంతో ఆర్థిక లేమితో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. జగన్‌రెడ్డి పాలనలో కుంటుపడిన పేద ప్రజల జీవన ప్రమాణాలను కూటమి ప్రభుత్వం పెంచుతుందన్నారు.సంక్షేమ పథకాల అమలతో పాటు సంపద సృష్టించడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. తాను మోదీ సహకారంతో మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామికీకరణ, పెట్టుబడులకు ప్రోత్సాహం, సాగునీటి ప్రాజెక్టుల సత్వర నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. _ ఎంపీ అభ్యర్థిగా తనకు, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా కెవీఎస్ఎన్ఎస్.రాజుకి ఓటేసి గెలిపించాలని సీఎం రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు గేదెల సత్యనారాయణ, ఈర్లె శ్రీరామూర్తి, ఎం.బాబ్జీ, జి.కోటేశ్వరరావు, వి.అప్పారావు, దేవర అప్పారావు పాల్గొన్నారు.



ఉపాధి కూలీల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేష్.